# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 19-12-2025 ₹15/-










మహోన్నత భావాల సౌరభాలు

గీటురాయి
వారపత్రిక

# GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 49 హైదరాబాద్
శుక్రవారం 19 డిసెంబర్ 2025 రూ.15-00
జమాది ఉల్ ఆఖిర్ 27 1447 హిజ్రీ

**తొలిగీటు**

## వస్తువు పంపకంలో మీ పిల్లలందరి పట్లా న్యాయంగా, సమానంగా వ్యవహరించండి.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**



కథ

22

## విశ్వాసం గెలిచింది

## లోపల...


| | | |
|---|---|---|
| విమానయానం | ...... | 04 |
| శీతాకాల సమావేశాలు | ...... | 05 |
| మాటలకే పరిమితమైన మైనారిటీ హక్కులు | ...... | 08 |
| శిథిలాల మధ్య శుభకార్యం : గాజాలో ఆశ చిగురించిన వేళ | ...... | 10 |
| చరితార్థులు–2 : హాఫిజ్ ముహమ్మద్ ఇబ్రాహీం | ...... | 11 |
| బాలల జీవితంలో బంగారు పునాదులు | ...... | 12 |
| గతంలోకి ఒక చూపు – 7 | ...... | 14 |
| విద్వేష రాజకీయాలు ప్రమాదంలో ప్రజాస్వామ్య సౌధం | ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) | ...... | 19 |
| తల్లిదండ్రుల సేవలో తరిద్దాం ! | ...... | 20 |
| ఉరితాడును ముద్దాడిన అమర మిత్రులు | ...... | 24 |
| సలహా సంస్కారం ! | ...... | 26 |
| ఐదు నైతిక విలువలు మనిషి జీవన మార్గదర్శకాలు | ...... | 28 |
| పెళ్లి పేరిట వృథా ఆపండి | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| కృతజ్ఞత | ...... | 34 |


### పనికి మాలిన రచ్చ



పార్లమెంటు వేదికగా
పనికిరాని చర్చలు
వందేమాతరం పైన
ఎందుకండి ఎచ్చులు!

పనికొచ్చేది ఏదయిన
చర్చించండోయి సారు
అనవసరంగ ప్రజల్ని
చెయ్యకండి బేజారు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## విమానయానం

**గత సంవత్సరం** సెప్టెంబరు మాసంలో ప్రధాని మోడీ దేశంలో విమానయాన రంగం అభివృద్ధి గురించి చెప్పారు. ప్రాంతీయ అనుసంధాన పథకంతో విమాన ప్రయాణం ప్రజలందరికీ అందుబాటులోకి వస్తుందని అన్నారు. అంతకు ముందు ప్రధాని ప్రారంభించిన "ఉడాన్" పథకం గురించ కూడా చాలా మందికి తెలిసే ఉంటుంది. దేశంలో మధ్యతరగతి ప్రజలకు కూడా రైళ్ళు, బస్సుల మాదిరిగా విమానాలు ఎక్కే యోగం పడుతుందని అందరు సంతోషంచారు.

గత కొన్ని రోజులుగా దేశంలో విమాన ప్రయాణీకుల కష్టాల కథలు పుంఖాను పుంఖాలుగా వస్తున్నాయి. ఇండిగో సంక్షోభం విషయంలో తప్పంతా మంత్రి రామ్మోహన్నాయుడిపై నెట్టేసే ప్రయత్నాలు కూడా దేశప్రజలు చూశారు.

ఇండిగో విమానయాన సర్వీసులు వేలాదిగా రద్దయ్యాయి. ప్రయాణీకులు ఎయిర్ పోర్టుల్లో చిక్కుకుపోయారు. ఒక్కొక్కరిది ఒక్కో వేదన. సంబంధిత వీడియోలు వైరల్ అవుతున్నాయి.

ఈ సంక్షోభం లాజిస్టిక్స్ వైఫల్యం కంటే చాలా తీవ్రమైనది. ఈ సంఘటనతో దేశంలో విమానయాన రంగం లోటుపాట్లు బట్టబయలయ్యాయి. ఈ సంక్షోభం కార్పొరేట్ ఆధిపత్యం గురించి, గుత్తాధిపత్యం గురించి చర్చను తెరపైకి తీసుకువచ్చింది.

విమాన సర్వీసులు రద్దవ్వడంతో విదేశాల నుంచి వచ్చిన ప్రయాణీకులు కూడా ఎయిర్ పోర్టుల్లో చిక్కుకుపోయారు. ఇది దేశ ప్రతిష్ఠను కూడా దెబ్బతీసే అంశమయ్యింది.

ఈ సంక్షోభానికి కారణమెవ్వరు? విమానాలు నడిపే పైలట్లు కాదు, ఫ్రంట్‌లైన్ సిబ్బంది, క్యాబిన్ సిబ్బంది, గ్రౌండ్ సిబ్బంది వీరెవ్వరి పాత్ర ఇందులో లేదు. నిజానికి వీళ్ళందరు ప్రయాణీకులకు సహాయం చేయడానికి శాయశక్తులా ప్రయత్నించేవారే. ఈ నేపథ్యంలో ఒక అంతర్గత లేఖ బయటపడింది. సిబ్బంది, ముఖ్యంగా పైలట్లకు విశ్రాంతి గురించి చేసిన హెచ్చరికలను విస్మరించారని తెలియవచ్చింది. అసలు బాధ్యత కార్పొరేట్ నిర్వహణపై ఉంది, నిర్వహణ వైఫల్యం ఈ సంక్షోభానికి ప్రత్యక్ష కారణం.

అయితే ఈ సంక్షోభం వెనుక పరోక్ష కారణాలు కూడా మనం గమనించాలి. ముఖ్యంగా వాణిజ్య రంగంలో గుత్తాధిపత్యం గురించి చర్చించాలి. భారత పౌర విమానయానంలో ఇండిగో సంస్థ 60 శాతానికి పైబడి సర్వీసులు నడుపుతున్న సంస్థ. మొత్తం విమానయానం ఇలా ఒకే సంస్థపై ఆధారపడడం వల్ల పోటీ అనేది లేకుండా పోయింది. ఇదే విషయాన్ని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పారు. వాణిజ్యంలో "గుత్తాధిపత్యం" వల్ల తలెత్తన సంక్షోభంగా చెప్పారు.

అంటే ఇది కేవలం విమానయానానికి మాత్రమే సంబంధించింది కాదు. నేడు దేశంలో అనేక రంగాల్లో గుత్తాధిపత్యం కనిపిస్తోంది. అంటే ఇలాంటి సంక్షోభాలు తలెత్తే అవకాశాలున్నాయి. గుత్తాధిపత్యం ఉన్నప్పుడు ప్రభుత్వాలను కూడా కార్పోరేట్లు శాసించే స్థాయిలో ఉంటారు. పోటీ లేకపోవడం వల్ల ఆడింది ఆటగా చెలామణి అవుతుంది. ఈ గుత్తాధిపత్యం సృష్టించే సమస్యల గురించి గతంలోనే రాహుల్ గాంధీ ఒక వ్యాసంలో హెచ్చరించారు. ఆ హెచ్చరికలే ఇప్పుడు నిజమయ్యాయి.

ఒక విమానయాన సంస్థ మార్కెట్‌లో చాలా పెద్ద వాటా కలిగి ఉన్నప్పుడు, ఆ సంస్థ విఫలమయతే ప్రత్యామ్నాయాలు చాలా తక్కువగా ఉంటాయి, మొత్తం వ్యవస్థ కుప్పకూలుతుంది. గుత్తాధిపత్యం సేవల నాణ్యతను తగ్గిస్తుంది.

వాణిజ్యంలో ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం ఉండాలని ఈ సంక్షోభం రుజువు చేసింది.

ఈ సంక్షోభం సందర్భంగా అదానీ గ్రూప్ కూడా చర్చల్లోకి వచ్చింది. భారత దేశంలోని అనేక ప్రధాన విమానాశ్రయాలు అదానీ గ్రూపు చేతుల్లో ఉన్నాయని గమనించాలి.

అదానీ గ్రూపు పౌరవిమానయాన రంగంలో అడుగుపెడుతుందా? ఇండిగో సంక్షోభం అందుకు అవసరమైన తలుపులు తెరిచే ప్రయత్నమా?వంటి కుట్రకోణాలు కూడా కొందరు చర్చిస్తున్నారు. కుట్ర కోణాలను పక్కన పెట్టినా, గుత్తాధిపత్యం వల్ల తలెత్తే సమస్యలను పక్కన పెట్టలేం.

ఈ సమస్య కేవలం రద్దయిన విమానాల సమస్య కాదు. ఎలాంటి ఆర్థిక విధానాలు ప్రజల ప్రయోజనాలను కాపాడతాయనే చర్చ జరగాలి. ఆ చర్చ ఎక్కడ జరగాలి. చట్టసభల్లో జరగవలసిన చర్చ. ఏం చర్చలు జరిగాయో మనమంతా చూశాం. ✤

అబ్దుల్ వాహెద్




భారత రాజకీయాల్లో బంగ్లాదేశీ చొరబాటుదారులనే సమస్య చాలా కాలంగా కొన్ని రాజకీయ శక్తులకు ఓట్లవాన కురిపించే సాధనంగా ఉపయోగపడుతూ వస్తోంది. బెంగాలీ మాట్లాడే భారతీయులను, ముఖ్యంగా వివిధ రాష్ట్రాల్లో పొట్టచేతపట్టుకుని ఉపాధి వెదుక్కుంటూ వలస వచ్చిన బెంగాలీలను బంగ్లాదేశీలుగా అనుమానించి బలవంతంగా బంగ్లాదేశ్‌లోకి నెట్టేస్తున్నారనే ఆరోపణలు కూడా ఇటీవల ఎక్కువయ్యాయి. కొన్ని నెలల క్రితం పశ్చిమ బెంగాల్‌కు చెందిన నిండు గర్భిణీ సునాలి ఖాతూన్‌ను, ఆమె కుటుంబ సభ్యులను బలవంతంగా బంగ్లాదేశ్‌లోకి నెట్టేసిన కథనం వార్తల్లో వచ్చింది. సుప్రీంకోర్టు జోక్యంతో ఆ గర్భిణీ మహిళను, ఆమె బిడ్డను తిరిగి కేంద్ర ప్రభుత్వం ఇండియాకు తీసుకువచ్చింది. బంగ్లాదేశీలు అనే అనుమానంతో ఢిల్లీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బంగ్లాదేశ్ సరిహద్దుల వద్ద బలవంతంగా నెట్టి వేశారనే ఆరోపణలు వచ్చాయి. పశ్చిమ బెంగాల్‌లోని బీర్‌భూమ్ జిల్లాకు చెందిన మరికొందరు కూడా ఇలాగే నెట్టివేయబడ్డారని, వారిని కూడా కోర్టు జోక్యం తర్వాత తిరిగి ఇండియాకు తీసుకు వస్తున్నారని తెలుస్తోంది. ఇదేమీ మొదటి కేసు కాదు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాకు చెందిన వలస కార్మికుడు అమీర్ ఎస్.కె. గురించి వార్తలు వచ్చాయి. క్లుప్తంగా చెప్పాలంటే, బెంగాలీ మాట్లాడేవారిని బంగ్లాదేశీలని అనుమానించి బంగ్లాదేశ్‌లోకి బలవంతంగా నెట్టేస్తున్నారనే ఆరోపణలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో పార్లమెంటులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం ఓటర్ల జాబితా పునస్సమీక్ష కఠినంగా నిర్వహిస్తామని ఆయన అన్నాడు. చొరబాటు దారులను "గుర్తించడం, ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, దేశం నుంచి బహిష్కరించడం" (detect, delete and deport) తమ విధానం అని ప్రకటించారు.

ప్రస్తుతం 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా పునస్సమీక్ష జరుగుతోంది. ఎన్నికలకు ముందు యస్ఐఆర్ పేరుతో జరుగుతున్న ఈ ప్రక్రియలో అనేక మంది బూత్-స్థాయి అధికారులు మరణించిన వార్తలు కూడా వచ్చాయి. అమిత్ షా

తన ప్రసంగంలో ఈ మరణాలను గురించి ఒక్కమాట చెప్పలేదు. అలాగే బీహార్ ఎన్నికలకు ముందు కూడా ఈ యస్ఐఆర్ ప్రక్రియ అక్కడ జరిపారు. అందులో ఎంతమంది బంగ్లాదేశీ చొరబాటు దారులను గుర్తించారో ఆ వివరాలు కూడా ఆయన చెప్పలేదు. కాని బంగ్లాదేశీ చొరబాటుదారులనే భయసందేహాలను సృష్టించడం ద్వారా రాజకీయ ప్రయోజనాలు సాధించుకునే ప్రయత్నం చేశారు.

ఈ విషయంలో ప్రతిపక్షాలు దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. ఈ అక్రమ చొరబాటుదారులంతా ప్రతిపక్షాలకు ఓటు వేసే ఓటుబ్యాంకులన్నట్లు చిత్రీకరించారు.

ఈ క్రమంలో అమిత్ షాకు, రాహుల్ గాంధీకి మధ్య వాదోపవాదం కూడా చోటు చేసుకుంది. ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలో ప్రధాన ఎన్నికల కమిషనర్కు ఇమ్యూనిటీ సౌకర్యం గురించి రాహుల్ గాంధీ నిలదీసినప్పుడు అమిత్ షా తన ప్రసంగం ఎలా ఉండాలో తానే నిర్ణయించుకుంటానని, ప్రతిపక్ష నాయకుడు నిర్ణయిం చడం కుదరదని అన్నారు. ఈ ప్రతిస్పందన కాస్త విచిత్రంగా వినిపిం చింది., దీనికి హెూంమంత్రి స్పందిస్తూ ప్రతిపక్ష నాయకుడు "తన ప్రసంగ గమనాన్ని నిర్ణయించలేరు" అని బదులిచ్చారు.

ఈ మొత్తం వ్యవహారంలో కాస్త ఆలోచిస్తే మతతత్వ రాజకీయాలు చాలా పచ్చిగా కనిపిస్తాయి. అమిత్ షా అభిప్రాయం ప్రకారం ప్రతిపక్షాలు దేశంలో అక్రమ బంగ్లాదేశీ చొరబాటుదారులకు మద్దతు పలుకుతున్నాయి. ఎందుకంటే వారందరు ప్రతిపక్షాలకు ఓటర్లుగా ఉన్నారట. ఎన్ని లక్షల మంది అలాంటి వారు బిహారులో పట్టుబడ్డారు? ఈ ప్రశ్నకు జవాబు లేదు. అమిత్ షా చెప్పిన మరో మాట గమనించదగింది. అదేమిటంటే, "ఈ దేశం ఇప్పటికే ఒకసారి జనాభా ఆధారంగా విభజించబడింది, మరో విభజన మేము కోరుకోవడం లేదు. అక్రమ చొరబాటుదారులను ఆపాలి" అన్నారు. అక్రమ చొరబాటుదారులను ఆపాలన్నది నిజమే. ఆ పని చేయ వలసింది కేంద్ర ప్రభుత్వం. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సు కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో ఉంటుంది. అలాగే దేశ విభజన పేరుతో జరిగే మతరాజకీయాలు అందరికీ తెలిసినవే. అదే మతాన్ని వాడుకోవడం కొనసాగిస్తున్నారు. దేశవిభజన ఇంతకు ముందు జరిగింది. ఇప్పుడు మరో విభజన జరక్కుండా ఈ ఓటర్ల జాబితా సవరణ చేయిస్తున్నాం అంటున్నారు. ఇందులోని మతతత్వ రాజకీయాలను గుర్తించడానికి పెద్దగా తెలివితేటలు అవసరం లేదు.

అమిత్ షా ఎంత నిస్సిగ్గుగా ప్రతిపక్షాలను చొరబాటుదారులకు మద్దతిచ్చే వారని చెప్పారంటే, బిహార్లో రాహుల్ గాంధీ చేసింది "చొరబాటుదారులను రక్షించే యాత్ర" అన్నాడు. ఇదే క్రమంలో కర్ణాటక, హర్యానా ఎన్నికల్లో ఓట్ల దొంగతనం జరిగిందని రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను విమర్శించే ప్రయత్నాలు చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీతో తీవ్ర వాదోపవాదం చోటు చేసు కుంది. తాను చేసిన మూడు పత్రికా సమావేశాలపై అమిత్ షా చర్చకు సిద్ధమేనా అని రాహుల్ గాంధీ సూటిగా సవాలు విసిరారు. ఈ సవాలును అమిత్ షా స్వీకరించలేదు.

బీజేపీ ఎన్నికల్లో వరుసగా గెలుస్తున్నప్పటికీ, కొన్ని చోట్ల ఓడి పోయిందని, కాంగ్రెస్ గెలిచినప్పుడు సంబరాలు చేసుకుంటుంది, కాని ఓడిపోతే ఓట్ల దొంగతనం వంటి ఆరోపణలు చేస్తుందని చెప్పారు. ఈ మాటలు కూడా కాస్త పరిశీలించాలి.

మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల తర్వాత నుంచి కాంగ్రెస్ ఓట్ల దొంగ తనం అనే ఆరోపణ చేస్తోంది. రాహుల్ గాంధీ మొదటి ప్రెస్ కాన్ఫరెన్సులో ఓట్లదొంగతనం గురించి ఇచ్చిన ఉదాహర ణల్లో కర్నాటకలోని అలంద్ నియోజకవర్గం కూడా ఒకటి. అక్కడ నిజానికి కాంగ్రెస్ గెలిచింది. కాబట్టి కాంగ్రెస్ గెలిచినప్పుడు సంబరాలు చేసుకుంటుంది, ఆరోపణలు చేయదు అనడం తప్పు. అవకతవకలు జరిగాయని చెప్పిన అలంద్ నియోజకవర్గంలో కాంగ్రెసే గెలిచింది. అంతేకాదు, మొదటి ప్రెస్ కాన్ఫరెన్సులో కర్నాటక గురించి రాహుల్ మాట్లాడారు. కాని నిజానికి కర్నాటకలో కాంగ్రెసే గెలిచింది. అక్కడ ప్రభుత్వం కూడా కాంగ్రెసు ఏర్పాటు చేసింది. కాంగ్రెసు గెలిచిన రాష్ట్రాల విషయంలో ఓట్లదొంగతనం గురించి మాట్లాడడం లేదని అనడం తప్పు. నిజానికి ఓట్ల జాబితా అవకతవకలపై బీజేపీ కాదు, ఎన్నికలసంఘం జవాబు చెప్పాలి. అనవసరంగా బీజేపీ నేతలు ఈ బాధ్యత తమ నెత్తిన వేసుకుంటున్నారు.

మహదేవపురా ఓటర్ల జాబితా విషయంలో అవకతవకలను ఆధారా లతో సహా రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఇక్కడ గమనించవల సిన మరో విషయమేమిటంటే, ఆ ప్రెస్ కాన్ఫరెన్సులో రాహుల్ గాంధీ తమకు డిజిటల్ కాపీలు ఎన్నికల సంఘం ఇచ్చినట్లయితే ఈ అవకతవకలను కొన్ని గంటల్లో పట్టుకోవచ్చు, కానీ ఎన్నికల సంఘం డిజిటల్ కాపీలు ఇవ్వడం లేదని అందువల్ల విశ్లేషించడా నికి అనేక రోజులు, వారాలు, నెలలు పడుతుందని అన్నారు. ఈ మాట నిజమే. డిజిటల్ కాపీ ఇవ్వడానికి అభ్యంతరమేమిటో సంతృప్తికరమైన సమాధానం లభించలేదు.

ఈసారి లోక్సభ సమావేశాల్లో చాలా ఆసక్తికరమైన చర్చలు జరిగాయి. వందేమాతరంపై చర్చ జరిగింది. వందేమాతరం జాతీయ గేయం. దానిపై చర్చ, సుదీర్ఘమైన చర్చ జరపవలసిన అవసరమేం వచ్చిందన్నది చాలా మందికి అర్థం కాలేదు. కాని ఇంకా చాలా మందికి ఇదంతా బెంగాల్ ఎన్నికల ఏర్పాట్లలో భాగమని అర్థం చేసుకున్నారు. కాని వందేమాతరంపై చర్చ బీజేపీని ఇరకాటంలో పెట్టిందని పలువురి అభిప్రాయం. ఎందుకంటే, స్వాతంత్ర్యానికి పూర్వం బీజేపీ మాతృసంస్థ ఆరెస్సెస్ ఎన్నడూ వందేమాతరం నినాదంతో స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్న ఉదాహరణ ఒక్కటి కూడా లేదు. లోక్సభలో సంజయ్ సింగ్ ఇదే విషయాన్ని సూటిగా ప్రశ్నించాడు. వందేమాతరం అని నినదించి జైలు కెళ్ళిన వాళ్ళు ఆరెస్సెస్లో కనీసం నలుగురైనా

ఉన్నారా అని నిలదీశాడు. ఈ ప్రశ్నలపై ప్రజలు కూడా ఆలోచిస్తారు.

వందేమాతరంపై చర్చ తర్వాత ఓటర్ల జాబితా పునస్సమీక్షపై చర్చ జరిగింది. ఈ చర్చలో కూడా బీజేపీ ఇరకాటంలోనే పడింది. రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, సంజయ్ సింగ్ తదితర నేతలు బీజేపీకి చుక్కలు చూపించారు.

గమనించవలసిన విషయమేమిటంటే రాహుల్ గాంధీని "పప్పు"గా నిరూపించడానికి బీజేపీ కోట్లరూపాయలు ఖర్చు పెట్టి సాధించిందేమిటి? ఇప్పుడు జరుగుతున్నదేమిటి? ముఖ్యంగా దేశవ్యాప్తంగా భారత్ జోడో యాత్ర తర్వాతి నుంచి రాహుల్ గాంధీ రాజకీయాలు బీజేపీకి గొంతులో పచ్చివెలక్కాయల్లా మారాయి.

భారతరాజకీయాల్లో ఇప్పుడు ముఖ్యమైన వాస్తవమేమిటంటే, రాహుల్ గాంధీ, ఇందిరా గాంధీ, నెహ్రూల ప్రస్తావన లేకుండా బీజేపీ రాజకీయాలు చేయలేదు. మరింత విచిత్రమేమిటంటే, దాదాపు బీజేపీ నేతలందరు రాహుల్ గాంధీకి ఏమీ తెలియదని, పప్పు అని, ఆయన్ను ఎవరూ సీరియస్‌గా తీసుకోరని దేశప్రజలను నమ్మించడానికి ప్రయత్నించే క్రమంలో రాహుల్ గాంధీ పేరెత్తకుండా ఒక్క ముక్క కూడా మాట్లాడలేని స్థితికి చేరుకున్నారు.

రాహుల్ గాంధీ ఇప్పుడు జర్మనీ వెళ్ళబోతున్నానని ప్రకటించారు. అక్కడ ఎవరెవరిని కలుస్తారో ఆ వివరాలు కూడా బయటకు వచ్చాయి. ఆ వెంటనే బీజేపీ నేతలు యథాప్రకారం రాహుల్ గాంధీని ఎవరూ సీరియస్‌గా తీసుకోరంటూ ప్రారంభించి, అసలాయన జర్మనీ ఎందుకు వెళుతున్నారనే ప్రశ్న దగ్గరకు వచ్చారు. పార్లమెంటు సమావేశాలు 19వ తేదీన ముగుస్తాయి. రాహుల్ గాంధీ 15వ తేదీన వెళుతున్నారు. పార్లమెంటులో తన చర్చలన్నింటిలోను రాహుల్ గాంధీ పాల్గొన్నాడు. ఇక ఆయన జర్మనీ వెళుతుంటే బీజేపీకి అభ్యంతరమేమిటి?

రాహుల్ గాంధీ బహిరంగంగా ప్రకటించి విదేశాలకు వెళ్ళినా, లేదా ఎవరికీ చెప్పకుండా విదేశీ యాత్రకు వెళ్ళినా... ఎలా వెళ్ళినా సరే బీజేపికి చాలా అభ్యంతరాలుంటాయి. కారణమేమిటి? విదేశాల్లో మోదీ ప్రతిష్ఠ రాహుల్ గాంధీ పర్యటనల వల్ల మసక బారుతుందన్న భయమా?

రాహుల్ గాంధీ పట్ల బీజేపీ నేతల వైఖరి, బీజేపీపై రాహుల్ గాంధీ చేస్తున్న దాడుల నేపథ్యంలో లోక్‌సభలో ఓటర్ల జాబితా పునస్సమీక్షపై చర్చను చూడాలి. ఇప్పటి వరకు ఓటర్ల జాబితా విషయంలో అవకతవకల గురించి ఎవరు మాట్లాడినా అనధికారికంగా మాత్రమే మాట్లాడేవారు. కాని ఇప్పుడు అధికారికంగా, లోక్ సభలోనే చర్చ జరిగింది. రాహుల్ గాంధీ ఓటర్ల జాబితాపై అవకతవకల గురించి పత్రికా సమావేశాల్లో మాట్లాడితే ఎన్నికల సంఘం రాహుల్ గాంధీ అఫిడవిట్ ద్వారా ఈ విషయాలు ఎన్నికల సంఘానికి నివేదించాలని చెప్పింది. క్లుప్తంగా చెప్పాలంటే, నిన్నటి వరకు ఓట్లదొంగతనం అనేది కేవలం ఒక రాజకీయ ఆరోపణ స్థాయిలో మాత్రమే ఉండేది. కాని ఇప్పుడు పార్లమెంటు చర్చల్లోకి వచ్చిన ముఖ్యమైన సమస్య అయ్యింది. వందేమాతరంపై చర్చకు ఒప్పుకుంటే యస్ఐఆర్‌పై చర్చకు ఒప్పుకుంటామని చెప్పి బీజేపీ రాజకీయంగా చాలా పప్పులో కాలేసిందా? ఎందుకంటే పార్లమెంటులో చర్చకు వచ్చిన సమస్య అయిపోయింది ఇప్పుడు. ఇలా చేయడంలో కాంగ్రెస్ విజయం సాధించింది. ఒకవేళ బీజేపీ ఓటర్ల జాబితాలో అవకతవకలేవీ లేవని కొట్టేసినా, నిజానికి ఓటర్ల జాబితాపై ఆరోపణలకు జవాబు ఇవ్వవలసిన ఎన్నికల సంఘం బాధ్యతను బీజేపీ తన భుజాలపై ఎందుకు వేసుకుందన్న ప్రశ్న ప్రజల మెదళ్ళ నుంచి చెరిపివేయలేరు.

ఈ పార్లమెంటు సమావేశాలను పరిశీలిస్తే, రాజకీయ ఎత్తులు పైఎత్తులు ఆసక్తికరంగా ఉన్నాయి. బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయావకాశాలు పెంచడానికి బీజేపీ వందేమాతరం 150 సంవత్సరాల సందర్భంగా పార్లమెంటులో చర్చ జరిపితే బెంగాల్ ఎన్నికల్లో మతతత్వ రాజకీయాలు నడిపే అవకాశం గొప్పగా లభిస్తుందనేది బీజేపీ వ్యూహం. ఎందుకంటే, వందేమాతరంపై ముస్లింలీగ్ వ్యతిరేకత అందరికీ తెలిసిందే. అలాగే ముస్లిములు వందేమాతరం నినాదాన్ని వ్యతిరేకిస్తారనే ప్రచారం కూడా చేయవచ్చు. ఆవిధంగా వందేమాతరంపై చర్చ లాభిస్తుందనుకున్నారు. కాని ప్రతిపక్షాలు ఈ చర్చకు ఒప్పుకోవు. ప్రతిపక్షాలు ఓటర్ల జాబితా సవరణపై చర్చకు పట్టుబడుతున్నాయి. వందేమాతరంపై చర్చకు ప్రతిపక్షాలు ఒప్పుకుంటే ఓటర్ల జాబితా సవరణపై చర్చకు ఒప్పుకుంటామని మెలికపెట్టి ఒకే దెబ్బకు రెండు పిట్టలను పడగొట్టవచ్చని భావించారు. వందేమాతరం చర్చ వల్ల హిందూముస్లిం రాజకీయాలు నడిపే అవకాశం సృష్టించుకోవడం. ఓటర్ల జాబితాపై చర్చ సందర్భంగా బంగ్లాదేశీ చొరబాటుదారులే ప్రతిపక్షాల ఓటర్లన్నట్టు చిత్రీకరించి దాన్ని కూడా తమకు అనుకూలంగా మలచుకోవడం. ఈ ఎత్తుగడ చివరకు బెడిసికొట్టింది.

ఎందుకంటే, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్, గోగోయ్, ఆప్ నేత సంజయ్ సింగ్, తృణమూల్ కాంగ్రెస్ నేతలు వందేమాతరం విషయంలోను, ఓటర్ల జాబితా విషయంలోను ఎదురుదాడులకు దిగడమే కాదు, బీజేపీ నేతల జవాబుల్లో పసలేదని ప్రజలు కూడా గ్రహించేలా చర్చలు ముగిశాయి. వందేమాతరం విషయంలో ఆరెస్సెస్ కూడా ఎన్నడూ వందేమాతరం నినాదంతో ప్రజాపోరాటాల్లోకి రాలేదు. కాంగ్రెస్ సదస్సుల్లో వందేమాతరం పాడేవారు, కాని ఆరెస్సెస్ సమావేశాల్లో వందేమాతరం పాడేవారు కాదని కాంగ్రెస్ అధ్యక్షుడు చర్చలో దాడి చేశారు. ఓటర్ల జాబితా చర్చ సందర్భంగా ఈవియం మెషిన్లలో లోడ్ చేసే సోర్స్ కోడ్ పరిశీలన వరకు అనేక విషయాలు చర్చకు వచ్చాయి. ఇవన్నీ ఇప్పుడు అధికారికంగా పార్లమెంటు రికార్డులై పోయాయి. చివరకు వందేమాతరంపై చర్చ బీజేపీకి లాభించిందా లేదా నష్టం కలిగించిందా? ✤




# మాటలకే పరిమితమైన మైనారిటీ హక్కులు

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

భారతదేశం ఒక ప్రజాస్వామ్య, సెక్యులర్ దేశం. ఇక్కడ పౌరులందరికీ సమాన హక్కులూ, అవకాశాలు లభ్యం కావాలి. ఏ ఒక్కరిపట్లా వివక్ష, పక్షపాతం ఉండకూడదు. దేశంలో న్యాయం, ధర్మం అమలవుతున్నాయనడానికి ఇది నిదర్శనం. కాని పాలకుల నిర్వాకం వల్ల ఆ పరిస్థితి లోపించింది. గత ఏడున్నర దశాబ్దాలకుపైగా దేశంలో ఒక పెద్ద సమూహం అన్యాయానికి, వివక్షకు, అవకాశాల లేమికి గురవుతూఉంది. బడుగు బలహీన వర్గాలు, ముఖ్యంగా ముస్లిం మైనారిటీల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ఏడున్నర దశాబ్దుల కాలమంటే చిన్న విషయం కాదు. ఈ కాలంలో దేశం అనేక రంగాల్లో అభివృద్ధిని సాధించింది. కాని మైనారిటీ వర్గాలకు మాత్రం స్వాతంత్ర్య ఫలాలు ఇంకా అందని ద్రాక్షలుగానే మిగిలి పొయ్యాయి. ఇంతటి సుదీర్ఘ స్వతంత్ర భారతంలో పేదలు, బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు లభిస్తున్నాయా? అన్నది సమాధానం కోసం తడుముకోవాల్సిన ప్రశ్న. ఎందుకంటే, దేశంలోని ఒక పెద్ద మానవ సమూహం వివక్షకు, అన్యాయానికి, అవకాశాల లేమికి, పీడనకు, హక్కుల నిరాకరణకు గురవుతూ, సంక్షేమానికి దూరంగా ఉంది. నిజానికి పరాయి బానిసత్వం నుండి విముక్తి పొందిన తరువాత ప్రజల జీవితాలు మారిపోవాలి. వారి జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. అన్నిటికీ మించి వారి ఆత్మ విశ్వాసానికి ఆకాశమే హద్దు కావాలి. కాని మన దేశంలోని ముస్లిం మైనారిటీల పరిస్థితి అలా లేదు. అడుగడుగునా వారికి అవమానాలే ఎదురవుతున్నాయి. వారి హక్కులకు భంగం కలిగే అనేక కార్యక్రమాలు దేశంలో అనునిత్యం జరుగుతున్నాయి. వారి ఆస్తులకు, ప్రార్థనాలయాలకు రక్షణ లేని పరిస్థితి నెలకొంది. మోదీ, యోగీ లాంటి మతోన్మాద నేతలు అధికార పీఠం అధిరోహించిన నాటినుండి వారి జీవనం మరీ దుర్భరంగా మారిపోయింది. రాజ్యాంగం ప్రసాదించిన అనేక హక్కులకు దిక్కులేకుండా పోయింది. మొన్నటి ఎన్నికల్లో మెజారిటీ తగ్గి 240 సీట్లు మాత్రమే రాబట్టి సరిపోయింది గాని, అదే వారన్నట్లు నాలుగు వందలు దాటి ఉంటే ఈ పాటికి భారత రాజ్యాంగం ఏమై ఉండేదో ఉహిస్తేనే భయమేస్తోంది. ఇంతటి నియంతృత్వాన్ని, ఇంతటి ఫాసిజాన్ని దేశం ఎప్పుడూ చూడలేదు. నివాస గృహాలపై బుల్డోజర్లు నడపడం, ప్రార్థనాలయాలను కూల్చడం, ఇళ్ళలో జొరబడి భీభత్సం సృష్టించడం, నోట్లో మూత్రం పోయడం, దుకాణాలను కాల్చేయడం, పిల్లలు, మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడడం, ఉన్మాదంతో ఊగిపోతూ గుంపులు గుంపులుగా, మూకుమ్మడిగా నిస్సహాయులపై దాడి చేసి చంపడం, మైనారిటీలే లక్ష్యంగా వారి ప్రార్థనాలయాల ముందు

ఉన్మాదంతో ఊగిపోతూ, డ్యాన్సులు చేస్తూ ఆయుధాలు ప్రదర్శిం చడం, ఆ పరిసరాలన్నీ దద్దరిల్లేలా డీజే సౌండ్స్ పెట్టడం, ఎదురు పడిన వారిని చావబాదడం, ప్రార్థనాలయాల గుమ్మటాలెక్కి మరీ కాషాయ జెండాలు కట్టడం, మైనారిటీలకు వ్యతిరేకంగా అమాయక హిందూ సోదరుల్ని రెచ్చగొట్టడం లాంటి అనేక దుర్మార్గాలు జరుగుతున్నాయి. అయినా పోలీసులతో సహా అందరూ గుడ్లప్పగించి చూస్తారు తప్ప ఎవరూ ఏమీ మాట్లాడరు. కంచే చేను మేసినట్లు పాలకుల భావజాలమే ఉన్మాదమైనప్పుడు మంచిని, మానవీయతను ఆశించడం అత్యాశ తప్ప మరేమీ కాదు. ప్రభుత్వమే కక్షకట్టి మైనారిటీలకు వ్యతి రేకంగా చట్టాలు చేస్తుంటే ఇక వారికి, వారి హక్కులకు రక్షణ ఎలా ఉంటుంది? కనీసం తినే తిండి, తొడిగే బట్టవిషయంలో కూడా స్వతంత్రత లేకుండా పోయింది. మూకదాడులు, ఆస్తుల విధ్వసంతో పోయిన వారి ప్రాణాలు పోగా, మిగిలినవారి జీవితాలు దుర్భరమౌ తున్నాయి. అసలే పేదరికంతో మగ్గుతున్న జాతికి ఇది గోరు చుట్టుపై రోకటి పోటు. ఈనాటికీ దేశ మైనారిటీ జనాభాలో అరవైశాతం మంది ప్రజలు దారిద్ర్యరేఖ దిగువన దుర్భర జీవనం గడుపుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అత్యధిక శాతం మందికి సరైన జీవనోపాధి అవకాశాలు లేవు. కూడు, గూడు, గుడ్డ అన్న కనీస రాజ్యాంగ హామీ కూడా వీరికి వర్తిం చడంలేదు. అక్షరాస్యతా శాతం అతి హీనం. ఉన్నత స్థాయి విద్య నభ్యసించిన వారు కూడా చాలా తక్కువ. దేశ సంపదనంతా బడా బాబులకు ధారాదత్తం చేసి బడుగుల నోట్లో మన్నుకొట్టడం ప్రస్తుత పాలకులు చేస్తున్న పని. కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెట్టి, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి ఓట్లు రాబట్టుకొని అందలాన్ని ఎక్కడం పరివార్ ఫాసిస్టు శక్తులకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదు. మైనారిటీ వర్గాలకు వ్యతిరేకంగా మెజారిటీ వర్గాన్ని రెచ్చగొట్టడం, పురిగొల్పడం ఈ దుర్మార్గులకు వెన్నతో పెట్టిన విద్య. నిజానికి దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయబద్ధంగా, రాజ్యాంగ పరంగా వారికి లభించవలసిన హక్కులు, అవకాశాలు, అభివృద్ధి సంక్షేమ ఫలాలు లభించినప్పుడే 'స్వతంత్ర భారత' భావనకు పరిపూర్ణత చేకూరుతుంది. 'దేశ స్వాతంత్ర్య ఫలాలు, సమాన అవకాశాలు అందరికీ' అన్న రాజ్యాంగ హామీకి సార్థకత సిద్ధిస్తుంది. అలా కాకుండా దేశంలోని ఏఒక్క వర్గం ప్రజలైనా వివక్షకు, పక్షపాతానికి, అణచివేతకు, అవకాశాల లేమికి, న్యాయ నిరాకరణకు గురైతే దేశం ప్రగతీ వికాసాల బాటలో పయనించడం, నాగరిక లక్షణా లతో విలసిల్లడం అసాధ్యం. కనుక, పాలక పక్షాలు ఇప్పటికైనా స్పందించి దేశ ప్రజలకు, ముఖ్యంగా ఎస్ సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బడుగు బలహీన వర్గాల ప్రజలందరికీ రాజ్యాంగం కల్పించినటువంటి హక్కుల్ని వారికి అందించాలి. ముస్లిమ్ మైనారిటీలకు వారి జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ, పంచాయితీ మొదలు పార్లమెంటు వరకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి. వారి సంక్షేమానికి అరకొర నిధులు విదల్చడం కాకుండా ప్రత్యేకంగా సమగ్ర బడ్జెట్ కేటాయించాలి. ఎస్సీ, ఎస్టీలకు అత్యాచార నిరోధక చట్టం ఉన్నట్లుగానే, ముస్లిమ్‌ల కోసం కూడా అత్యాచార నిరోధక చట్టం తీసుకురావాలి. సబ్ ప్లాన్ అమలు చేయాలి. మైనారిటీ కార్పొరేషన్ , మైనారిటీ ఎడ్యుకేషన్ బోర్డు, ముస్లిమ్ పర్సనల్ లా, ఉర్దూ అకాడమీ, వక్ఫ్ బోర్డుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించు కోవాలి. కబ్జాకోరుల చేతుల్లో ఉన్న భూములు, ఇతరేతర ఆస్తుల్ని వారి నుండి తిరిగి రాబట్టాలి. విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలన్నింటిలో ముస్లింలకు సముచిత మైన, చట్టబద్ధమైన అవకాశాలు, ప్రాతినిధ్యం కల్పించాలి. దేశం పట్ల, దేశ ప్రజల పట్ల, అందులో భాగమైన మైనారిటీల పట్ల ఏమాత్రం బాధ్యత ఉన్నా కనీసం జస్టిస్ సచార్ సిఫారసులనైనా తక్షణం అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. బీఆరెస్ వాగ్దానం చేసి మోసం చేసిన 12 శాతం రిజర్వేషన్ల హామీని కాంగ్రెస్ సర్కారైనా అమలు చేసి మాది చేతల ప్రభుత్వమని నిరూపించుకోవాలి. ముస్లింలకు ఉపాధి అవకాశాల కల్పనలో, మైనారిటీ రుణాల విషయంలో గత బీఆరెస్ సర్కారు ఘోరంగా విఫలమైంది. కాంగ్రెస్ ఈ తప్పును సరిదిద్ది ముస్లింలకు వడ్డీరహిత రుణ సౌకర్యం కల్పించాలి. వారి సంక్షేమం కోసం 'రేవంతన్నాకా సహారా' లాంటి చిల్లర పథకాలు కాకుండా, ఏవైనా ప్రయోజనకర మైన నిర్దిష్ట పథకాలు ప్రకటించి అమలు చేయాలి. ముస్లింలు కూడా ఓటు బ్యాంకు రాజకీయాలకు లొంగకుండా, రాజకీయ చైతన్యం పెంపొందించుకొని, ఎవరో వస్తారు, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా రాజ్యాంగ ప్రసాదితమైన తమ వాటా సాధనకు రాజ్యాంగ బద్ధంగానే పోరాడాలి. పాలక పక్షాలు చురుగ్గా స్పందించేలా దేశంలోని ప్రజాస్వామ్య ప్రియులు, హక్కుల నేతలు, లౌకిక వాదులు, వామపక్షీయులు, బహుజన శక్తులతో కలిసి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రావాలి. ప్రజాస్వామ్య శక్తులు, భావసారూప్యత కలిగిన వ్యక్తులు, సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌర సమాజం సహకారంతో ముస్లిమ్ నేతలు, సంఘాలు ఐక్య కార్యాచరణ రూపొందించుకొని ఉద్యమాలకు పూనుకోవాలి. భాధిత వర్గాల్లో చైతన్యం రానంతకాలం పాలక పక్షాలు వారిని ఓటు బ్యాంకులుగానే పరిగణించి మోపెడ్‌లు, సైకిళ్ళు, పాన్ డబ్బాల వంటి (రేవతన్న సహారా అదే బాపతు) చిన్నచిన్న తాయిలాలతోనే సంతృప్తిపరిచే ప్రయత్నాలు చేస్తుంటాయి. కనుక చైతన్యంతో కార్యాచరణ రూపొందించుకొని సాధన దిశగా ముందుకు సాగితేనే హక్కులు పరిరక్షించబడే అవకాశం ఉంది. ✤



# శిథిలాల మధ్య శుభకార్యం: గాజాలో ఆశ చిగురించిన వేళ

**- ముహమ్మద్ వజీర్**

యుద్ధం అంటే కేవలం కూలిన భవనాలు, పేలిన గుళ్లు, ఆకాశాన్ని కమ్మేసిన పొగ మాత్రమే కాదు, అది ఆశల అణచివేత, జీవితాల విధ్వంసం. గాజా స్ట్రిప్ గత కొన్నేళ్లుగా ప్రపంచానికి ఒక విషాద గాథగా, నిరంతర రక్తపాతం, దుఃఖానికి చిరునామాగా మిగిలిపోయింది. అయితే, మొన్న ఖాన్ యూనస్‌లో జరిగిన ఒక సామూహిక వివాహ వేడుక, ఆ అంధకారంలో మెరిసిన ఒక చిన్న జ్యోతిలా నిలిచింది.

54 జంటలు – వధూవరులు, సంప్రదాయ పాలస్తీనియన్ ఎంబ్రాయిడరీ దుస్తులు ధరించి, పక్కన నల్ల సూట్లలో వరులు – శిథిలాల గుట్టలపై పరిచిన ఎర్ర తివాచీపై నడిచిన దృశ్యం మన హృదయాన్ని బరువెక్కిస్తుంది. చుట్టూ విధ్వంసం, కూలి పోయిన కట్టడాలు, పేదరికం, ఆకలి వెంటాడుతున్నా... ఆ జంటల కళ్ళల్లో మెరిసిన నూతన జీవితపు కలలు, ఒక అద్భుతం.

యుద్ధం వారి నుండి ఇళ్లను, కుటుంబ సభ్యులను, స్థిరత్వాన్ని లాగేసుకుంది. వధువు ఇమాన్ హసన్ లవ్వా తన తల్లిదండ్రులను కోల్పోయిన విషాదాన్ని కన్నీళ్లతో పంచుకున్నారు. "ఇంతటి దుఃఖం తర్వాత సంతోషాన్ని అనుభవించడం కష్టం," అంటూనే, "దేవుడి దయవల్ల, మేము ఇటుక ఇటుక పేర్చి తిరిగి నిర్మి స్తాము," అని ఆమె చెప్పిన మాటలు కేవలం ఒక వ్యక్తి ఆశా వాదం కాదు, అది యావత్ గాజా ప్రజల నిర్భయమైన ఆత్మ విశ్వాసం.

ఒకప్పుడు రోజుల పాటు వైభవంగా జరిగే వివాహ వేడుకలు, నేడు టెంట్లలో, యుద్ధ శిథిలాల మధ్య జరుగుతున్నాయి. వరుడు హిక్మత్ లవ్వా తన పూర్వపు కలను గుర్తు చేసుకున్నారు: "నాకు ఒక ఇల్లు, ఉద్యోగం ఉండాలని కలలు కనేవాడిని. ఈ రోజు, నా కల ఏమిటంటే, నివసించడానికి ఒక టెంట్ (గుడారం) దొరకాలి." ఈ మాటలు ఎంతటి దయ నీయమైన వాస్తవాన్ని చెబుతున్నాయో! జీవిత ప్రమాణాలు ఎంతగా పడిపోయాయో తెలుపుతున్నాయి.

పాలస్తీనియన్ సంస్కృతిలో, వివాహం అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల కలయిక కాదు, అది వంశాన్ని కొనసాగించడం, సంప్ర దాయాన్ని బ్రతికించుకోవడం. సమాజ శాస్త్రజ్ఞురాలు రాండా సెర్హాన్ అన్నట్లు, "ప్రతి కొత్త వివాహంతో పిల్లలు వస్తారు జ్ఞాపకాలు, వంశాలు చనిపోవు అని అర్థం." అంటే, గాజాలో ఈ పెళ్లిళ్లు కేవలం ప్రేమ కథలు కావు, అవి ఉనికి కోసం చేసే పోరాటం, తమ జాతి కొన సాగింపు కోసం వేసే గట్టి అడుగు.

ఈ వేడుకకు నిధులు సమకూర్చిన అల్–ఫారిస్ అల్–షాహిమ్ ఫౌండేషన్ ప్రతినిధి, "సంతోషపు దుస్తులు మళ్లీ పెరుగుతాయని చెప్పడానికి మేము ఈ స్థలాన్ని శిథిలాల మధ్య ఎంచుకున్నాము," అని చెప్పడం ఈ సంఘటన యొక్క ఉద్దేశాన్ని స్పష్టంగా తెలియ జేస్తుంది.

మొత్తం ప్రపంచం నిస్సహాయంగా చూస్తున్న సమయంలో, గాజా ప్రజలు తమ జీవితాలను తిరిగి ప్రారంభించడానికి ప్రయత్నిస్తు న్నారు. వారి ప్రేమకు, వారి ధైర్యానికి, అసాధ్యమైన పరిస్థితుల్లో కూడా ఆశను కోల్పోని వారి మానవత్వానికి మనం తల వంచాలి. ఇది ప్రపంచానికి ఒక సందేశం: ఎంతటి విధ్వంసం జరిగినా, మనిషిలోని జీవించాలనే కోరికను, ప్రేమించాలనే ఆకాంక్షను ఏ తుపాకీ కూడా చంపలేదు.

గాజాలో శుభం పలికిన ఈ జంటలు తమ టెంట్లలో కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారు. వారి ప్రయాణం కష్టమైనది కావచ్చు, కానీ వారి సంకల్పం దృఢంగా ఉంది. వారికి మంచి రోజులు రావాలని, ఈ సామూహిక వివాహం గాజా చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలకాలని ఆశిద్దాం. అది శాంతి, పునర్నిర్మాణం, మనుగడ యొక్క అధ్యాయం కావాలని కోరుకుందాం! ✤


‘చరితార్థులు’-2



# హాఫీజ్ ముహమ్మద్ ఇబ్రాహీం

## (1889 -1978)

99






**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **‘చరితార్థులు’ - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**భారత జాతీయోద్యమంలో** భాగస్వామి కావడం మాత్రమే కాకుండా స్వతంత్ర భారతంలో కూడా అత్యున్నత పదవులను అలంకరించిన అదృష్టవంతులు హాఫీజ్ ముహమ్మద్ ఇబ్రాహీం. ఆయన 1889 ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బిజినోర్ జిల్లా నగెన పట్టణంలో జన్మించారు. ఆయన తల్లి అజ్మత్–ఉల్–నిషాన్, తండ్రి హాఫీజ్ నజ్మల్ హుదా. చిన్న–సన్నకారు రైతు కుటుంబ సభ్యుడైన ముహమ్మద్ ఇబ్రాహీం ధార్మిక విద్యతో విద్యాభ్యాసం ఆరంభించారు. మదరసా విద్యార్థిగా ఖురాన్ గ్రంథాన్ని పూర్తిగా కంఠతా పట్టి ‘హాఫిజ్’ అయ్యారు. ఆర్థిక లేమితో సమమతమవుతున్నా కూడా ఆయన రాజకీయ దీక్షా విద్యాలయంలో చదివారు. ఆ తరువాత అలీఘర్‌లోని ‘డ్యూటీ సోసైటీ’ ఆర్థిక సహకారంతో 1908 నుండి 1915 వరకు అలీఘర్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. అలీఘర్ విద్యార్థి సంఘం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన దృష్టి జాతీయోద్యమం దిశగా మళ్ళింది. 1937 నాటి ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో ముస్లింలీగ్ అభ్యర్థిగా ఆయన విజయం సాధించారు. ఆనాటి అత్యంత నాటకీయ రాజకీయ పరిణామాలలో హాఫిజ్ ముహమ్మద్ ఇబ్రాహీం తనదైన వ్యవహార సరళితో అందరి దృష్టిని ఆకర్షించారు. ఆ తరువాత భారత జాతీయ కాంగ్రెస్ సభ్యత్వం చేపట్టిన ఆయన ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొందారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొని నిర్బంధానికి గురయ్యారు. చివరకు ఫతేపూర్ జైలులో శిక్షను కూడా అనుభవించారు. భారత విభజన డిమాండ్‌ను తెరమీదకు తెచ్చిన ముస్లింలీగ్ వేర్పాటువాదాన్ని ఖండించిన ఆయన, మతం ప్రాతిపదికన భారత విభజన అరిష్టదాయకం అన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ నాయకునిగా జాతీయోద్యమ కార్యక్రమాలలో చివరి వరకు చురుగ్గా పాల్గొన్న హాఫిజ్ ఇబ్రాహీం, స్వాతంత్ర్యం సిద్ధించాక జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలో ఏర్పడిన కేంద్ర ప్రభుత్వంలో మంత్రి పదవి చేపట్టారు. ఈ సందర్భంగా వక్ఫ్ ఆస్తుల రక్షణ మీద ప్రత్యేక శ్రద్ధను చూపిన ఆయన వక్ఫ్ పరిరక్షణకు చట్టపరమైన చర్యలను తీసుకున్నారు. భారత్ – పాకిస్తాన్‌ల మధ్యన సమస్యగా మారిన సింధూ నదీ జలాల పంపిణీ అంశాన్ని అందరికి ఆమోదయోగ్యమైన రీతిలో పరిష్కరించడంలో హాఫిజ్ ఇబ్రాహీం ప్రధాన పాత్ర వహించారు. 1964 మే నాలుగు నుండి 1965 సెప్టెంబర్ ఒకటి వరకు పంజాబ్ గవర్నర్ పదవిలో ప్రజలకు సేవలందించారు. 1958 నుండి 1968 వరకు దఫ–దఫాలు రాజ్యసభ సభ్యునిగా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. చివరి వరకు ఏదో ఒక ఉన్నత అధికార పదవిలో కొనసాగుతూ ప్రజలకు సేవలందించిన హాఫిజ్ ముహమ్మద్ ఇబ్రాహీం 1978 జనవరి 24న అనారోగ్యంతో చికిత్స పొందుతూ కన్నుమూసారు. ✤



డాక్టర్ ఫర్వీన్ సుల్తానా

# బాలల జీవితంలో బంగారు పునాదులు

## అలవాట్ల నిర్మాణంలో తల్లిదండ్రుల అద్భుత పాత్ర

**మానవ** మెదడు ఒక అద్భుత శక్తి కేంద్రం. ఇది మన దైనందిన జీవితంలోని వేలాది నిర్ణయాలలో చాలా వరకు అచేతనంగా, అంటే 'ఆటో-పైలట్' మోడ్లో తీసుకుంటుంది. నిత్య జీవితాన్ని క్రమబద్ధీకరించే ఈ అలవాటు వ్యవస్థే, పిల్లల మెదడు వైరింగ్ (Brain Wiring)కు మూలస్తంభం. అందుకే, వారి వ్యక్తిత్వ నిర్మాణంలో అలవాట్లను తీర్చిదిద్దడం కేవలం ఒక నైతిక అంశం కాదు, అది వారి భవిష్యత్తుకు వేసే బలమైన పునాది.

### బాల్యం : అచేతన రికార్డింగ్ కాలం

పిల్లల మెదడు అపారమైన గ్రహణ శక్తి కలిగి ఉంటుంది. అది చూసిన దాన్ని అనుకరిస్తుంది, విన్న దాన్ని పలుకుతుంది. ఈ పునరావృతం ద్వారానే అలవాట్లు రూపుదిద్దుకుని, వారి మనస్సు నిర్మాణంలో శాశ్వత భాగాలవుతాయి. మనస్తత్వవేత్తలు చెప్పినట్లుగా, "పిల్లల జీవితంలో మొదటి ఏడేళ్లు 'రికార్డింగ్ మోడ్'లో ఉండే కాలం." ఈ కాలంలో, వారు తమ అనుభవాలు, ప్రతిచర్యలు, దృశ్యాలను ఏ వడపోత లేకుండా అచేతన మనస్సులో నిక్షిప్తం చేసుకుంటారు.

భోజనం, శుభ్రత, సమయపాలన వంటి ప్రాథమిక విషయాల నుండి నిజాయితీ, ఇతరులను గౌరవించడం వంటి నైతిక విలువలను సైతం ఈ ఏడేళ్లలో సులువుగా నేర్చుకుంటారు. పదే పదే చేసే ప్రతి పని మెదడులోని న్యూరల్ పాత్‌వేలలో (నాడీ మార్గాలు) దృఢమైన దారిని ఏర్పరుచుకుంటుంది. ఈ మార్గాలు బలపడాలంటే, పునరావృతంతో పాటు భావోద్వేగ అనుబంధం తప్పనిసరి. ఆనందం, సంతృప్తితో చేసిన పనిని మెదడు శాశ్వతంగా భద్రపరుస్తుంది. ఈ 'రికార్డింగ్ మోడ్' కాలాన్ని తల్లిదండ్రులు ఒక విలువైన శిక్షణా అవకాశంగా గుర్తించాలి.

### మంచి అలవాట్లను పెంపొందించే ఐదు సూత్రాలు

పిల్లలలో సత్ప్రవర్తనను పెంపొందించడానికి తల్లిదండ్రులు ఐదు కీలక సూత్రాలను ఆచరించాలి:

**1. ఆదర్శంగా నిలవడం** : పిల్లలు మీరు "చెప్పే" దానికంటే "చూసే" దానినే త్వరగా స్వీకరిస్తారు. క్రమశిక్షణ, శుభ్రత, దయ, సమయపాలన వంటి లక్షణాలను తల్లిదండ్రులు స్వయంగా ప్రదర్శిస్తే, 'మిర్రర్ న్యూరాన్స్' చురుకై, ఆ లక్షణాలు పిల్లలలో అప్రయత్నంగా నాటుకుంటాయి. "పిల్లలు ఎలా ఉండాలనుకుంటున్నారో, ముందు మీరు అలాగే మారండి."

**2. శక్తివంతమైన పునరావృతం** : ఒక అలవాటు ఒక్క రోజులో ఏర్పడదు. అది నిరంతర పునరావృతం ద్వారానే స్థిరపడుతుంది. ఒక పనిని పదే పదే చేయించడం ద్వారా పిల్లల మనస్సు, శరీరం ఒక పద్ధతికి అలవాటుపడి, ఆ తర్వాత ఆ పనిని శ్రమ లేకుండా సులువుగా చేస్తారు.

**3. ఆనందంతో అనుసంధానం :** సంతోషంగా చేసే పనే పిల్లల మనస్సులో చిరకాలం ఉంటుంది. తీవ్రంగా, ఒక ప్రాజెక్ట్‌లా కాకుండా, సహనం, ఆప్యాయతతో కూడిన ప్రక్రియ ద్వారా వారికి నేర్పండి. తొందరపాటు లేకుండా, నేర్చుకునే ప్రక్రియను తల్లిదండ్రులు కూడా ఆస్వాదించాలి. పాటలు, కథల ద్వారా నేర్పిస్తే, ఆసక్తి పెరిగి, అలవాటు కూడా పటిష్టమవుతుంది.

**4. ప్రోత్సాహమే బహుమతి :** ప్రశంస, ప్రోత్సాహం ప్రతి మనిషికి అవసరం. పిల్లల వయస్సుతో సంబంధం లేకుండా వారిని నిజాయితీగా అభినందించండి. ఈ సానుకూల ప్రోత్సాహం వారి అభ్యాస వేగాన్ని పెంచి, అలవాట్లను వారి వ్యక్తిత్వంలో భాగం చేస్తుంది.

**5. పట్టుదలే పటిష్టం :** మంచి అలవాట్ల కోసం తల్లిదండ్రులు పెంపకంలో తొలి ఏడేళ్లు స్థిరత్వంతో కృషి చేయాలి. అలసిపోయినా, నిరాశ చెందినా, ఆగిపోకుండా విరామం తీసుకుని, కొత్త విధానంతో ముందుకు సాగాలి. చిన్న చిన్న లక్ష్యాలపై దృష్టి సారించి, వాటిని పూర్తి చేస్తూ నిలకడను నేర్పాలి.

## ఆసక్తిని రగిలించడం : మంచి అలవాట్ల కొనసాగింపు

ఏడేళ్ల తర్వాత, పిల్లలలో మంచి అలవాట్ల పట్ల ఆసక్తిని కొనసాగించడం శిక్షణలో అత్యంత ముఖ్యమైన దశ.

➢ సంకల్పం చేసుకునే అలవాటు ద్వారా వారు ఏ పని ఎందుకు చేస్తున్నారో తెలుసుకుంటారు.

➢ ఆరోగ్యకరమైన పోటీతత్వం ద్వారా మంచి పనులు చేయడానికి ప్రేరణ కలుగుతుంది.

➢ స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలు ఇవ్వడం వలన అలవాట్ల పట్ల వారికి స్పష్టమైన సంకల్పం ఏర్పడుతుంది.

➢ అంతకంటే ముఖ్యంగా, వారికి మనస్సాక్షిని గుర్తించడం నేర్పండి. తమ అంతర్గత మార్గదర్శిని వినడం ద్వారా, వారు తమలో తాము మంచి చేయాలనే, కొత్త సానుకూల అలవాట్లను స్వీకరించాలనే ప్రేరణను పొందుతారు.

## చెడు నుండి విముక్తి

తప్పు చేయడం అనేది అభ్యాసనలో భాగమే. అయితే, తప్పును గుర్తించి, దాని నుండి బయటపడటం ఒక గొప్ప సామర్థ్యం అని పిల్లలకు నేర్పాలి.

## చెడు అలవాటును అంతం చేయడం

మొండితనం, అబద్ధం లేదా కోపం వంటి అలవాట్లలో పిల్లలు చిక్కుకుంటే, తల్లిదండ్రులు కోపం చూపకుండా, సహనం, తెలివితేటలతో అలవాటు మూలాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. నిందలు వేయడం వలన పిల్లలు తమ తప్పును దాచిపెట్టడానికి ప్రయత్నిస్తారు. అందుకే, స్వరంలో మృదుత్వం, ఆప్యాయత నింపి, పిల్లలు సురక్షితంగా తమ తప్పును అంగీకరించే వాతావరణాన్ని సృష్టించండి. వారానికోసారి లేదా నెలకోసారి కలిసి కూర్చుని తమ ప్రవర్తనను స్వీయ-మూల్యాంకనం చేసుకోవడం నేర్పాలి.

## రీ-లెర్నింగ్: కొత్త మార్గం నిర్మాణం

చెడు అలవాటును వదిలివేసినప్పుడు, మెదడులోని పాత న్యూరల్ మార్గాలు బలహీనపడతాయి. అయితే, మెదడు ఖాళీగా ఉండదు! ఇది వెంటనే ఏదో ఒక చర్యకు స్థానం ఇస్తుంది. అందుకే, చెడు అలవాటును వదిలించేటప్పుడు, దాని స్థానంలో మంచి అలవాటును ప్రవేశపెట్టడం తప్పనిసరి. దీనినే బ్రెయిన్ రీవైరింగ్ అంటారు.

ఉదాహరణకు, స్క్రీన్‌కు బానిసైన పిల్లవాడిని "ఫోన్ వదిలెయ్" అని చెప్పడం కంటే, దాని స్థానంలో కథలు చదవడం, శారీరక ఆటలు ఆడడం వంటి ఆసక్తికరమైన కొత్త అభిరుచిని అందిస్తే, మెదడులో కొత్త న్యూరల్ పాత్‌వే ఏర్పడి, పాత చెడు అలవాటును క్రమంగా చెరిపేస్తుంది.

**'21 రోజుల నియమం'**: ఒక కొత్త అలవాటును అలవర్చుకోవడానికి లేదా పాత అలవాటు నుండి విడిపోవడానికి సగటున 21 రోజులు పడుతుందని మానసిక నిపుణులు చెబుతారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు 21 రోజుల ఛాలెంజ్ ఇచ్చి, నిలకడ ప్రాముఖ్యతను నేర్పాలి. అలవాట్లు ఒక్క రోజులో ఏర్పడవు, కానీ నిరంతర పట్టుదలతో అవి పిల్లల దృఢమైన వ్యక్తిత్వానికి ఆధారమవుతాయి.

## పరిసరాలకు అనుగుణంగా : దృఢమైన పాత్రతో మార్పును స్వీకరించడం

మార్పు అనేది జీవితంలో అనివార్యం. పరిస్థితులు, పాఠశాల, స్నేహితులు మారినా, తమ విలువలు, సూత్రాలు, విశ్వాసం చెక్కుచెదరకుండా కొత్త వాతావరణానికి అనుగుణంగా మారే సామర్థ్యమే నిజమైన నాయకత్వ లక్షణం.

పిల్లలు కొత్త అనుభవాలను ఎదుర్కొన్నప్పుడు, వారి భయాలు, అనుమానాలను ఓపికగా వినండి. వారి భావాలను గుర్తించి, వారి నిర్ణయాలు, ఆలోచనలను గౌరవించండి. "మారుతున్నామంటే మన గుర్తింపును కోల్పోవడం కాదు, మనల్ని మనం మరింత మెరుగుపరుచుకోవడం" అని వారికి నేర్పండి.

తల్లిదండ్రుల లక్ష్యం కేవలం కొన్ని అలవాట్లను నేర్పడం కాదు, పిల్లల జీవితాన్ని ఒక క్రమబద్ధమైన, సమతుల్యమైన జీవన వ్యవస్థగా తీర్చిదిద్దడం. మెదడు సహజ నిర్మాణాన్ని అర్థం చేసుకుని శిక్షణ ఇస్తేనే, పిల్లలు కేవలం మంచి అలవాట్లను మాత్రమే కాక, జీవితాంతం వారికి మార్గదర్శిగా నిలిచే ఒక స్వయంచాలక వ్యవస్థను నేర్చుకోగలుగుతారు.

7

గతంలోకి ఒక చూపు..

# తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్

**ఎస్.ఎమ్.మలిక్**

**అది,** ఆ నాటి ప్రభుత్వం ఎమర్జెన్సీ కాళరాత్రిని దేశంపైన రుద్దిన భయంకర కాలం, జమాఅత్ నాయకులు కటకటాల వెనుక, ఎప్పుడు తెల్లవారుతుందో అని నిరీక్షిస్తూ ఉన్న రోజులు! నేను మరో మిత్రులు సయ్యిద్ యూసుఫ్ గారు కలసి జమాఅత్ నుంచి తెలుగు పబ్లికేషన్స్‌ను సంస్థాగతంగా వేరు చేసి సొసైటీస్ ఆక్టుకు లోబడి రిజిస్టర్ చేయాలని అనుకున్నాము. నేను దాని ఆశయాలు వ్రాశాను, యూసుఫ్ భాయ్ లాయర్ గనక దానికి చట్ట పరమయిన భాషలో ఓ రూపమిచ్చారు. ఆ రోజుల్లో అరెస్టు కాని ఇతర మిత్రుల్నీ సంప్రదించుకున్నాము. మా ఐడియాతో ఇతర మిత్రులూ ఏకీభవించారు. రిజిస్ట్రేషనూ జరిగింది.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత 1978లో కొత్త అమీర్ హల్కా ఆధ్వర్యాన జరిగిన హల్కా షూరా (సలహా మండలి) సమావేశంలో తెలుగు పబ్లికేషన్స్ గురించి ఒక నిర్ణయం గైకొనడం జరిగింది. ఇంత వరకు జమాఅత్ తెలుగు ప్రచురణ విభాగం, కృష్ణా జిల్లాలోని పామర్రు గ్రామంలో, రషీద్ ముహియుద్దీన్ గారి నిర్వహణలో ఉండేది. ఇక మీదట అది 'తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్' అనే పేరుతో హైదరాబాద్ నుంచి నిర్వహించబడు తుందని నిర్ణయమయింది. ఇంకా తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ఆధ్వర్యాన ఒక వారపత్రిక ప్రారంభించాలని కూడా నిర్ణయించడం జరిగింది.

ఆ సందర్భంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి) రాష్ట్రంలో రాజధాని హైదరాబాద్ అయినప్పటికీ ఇక్కడి రాజకీయాలకు, తెలుగు భాషకు కేంద్రం, విజయవాడ అనీ నేను వాదించాను, ఈ వాదనను సలహా మండలి సభ్యులు అనేక మంది అంగీకరించారు. ఇంకా పబ్లికేషన్స్‌కి సెక్రెటరీగా షేఖ్ హమీదుల్లాహ్ షరీఫ్ భాయి ఉండాలని, ఆయనకు అసిస్టెంట్‌గా నేనుండాలని వచ్చిన ప్రతిపాదనలు కూడా దాదాపుగా ఆమోదం పొందాయి. కాని షరీఫ్ భాయి ఈ విషయాలకు సమ్మతించ లేదు.

## షరీఫ్ భాయి!

షరీఫ్ భాయి, తన వ్యక్తిగత కార్యకలాపాల దృష్ట్యా ఓ చోట కూర్చుని పబ్లికేషన్స్ వ్యవహారాలను నిర్వహించడం తనవల్ల సాధ్యం కాదని గట్టిగా పట్టు పట్టారు. తాను లేని సమయాల్లో నేనెలాగూ ఉంటాను కదా అని నేనెంతగా చెప్పినా ఆయన ససేమిరా అన్నారు. అప్పటికి ఆ నిర్ణయాన్ని ప్రక్కన పెట్టి, పబ్లికేషన్స్ ఆఫీసు, కంపోజింగ్ సెక్షన్ మాత్రం విజయవాడలో పెట్టడం, నేను విజయవాడకు మారడం గురించి నిర్ణయమయి పోయింది.

ఆ పైన నెల్సన్ ఫౌండ్రీ వారికి, ఒక పబ్లికేషన్స్‌కు అవసరమయిన కంపోజింగ్ సెక్షన్ కొరకు ఫాంట్స్, వాటి స్టాండ్స్ గట్రా అన్నీ ఆర్డర్ చేశాము. ఆ మెటీరియల్ కూడా వచ్చేసింది. ఆ వెంటనే విజయవాడలో ఓ ఇంటిని సయితం అద్దెకు తీసుకుని నేను





హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన 'గీటురాయి' వారపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జమాఅతె ఇస్లామీ హింద్ ఏ.పీ& ఒడిషా అధ్యక్షులు మౌలానా అబ్దుల్ అజీజ్. (చిత్రంలో) అమీరె జమాఅత్ మౌలానా ముహమ్మద్ యూసుఫ్. జనాబ్ షేఖ్ హమీదుల్లాహ్ షరీఫ్

దాదాపుగా విజయవాడలోనే ఉంటూ ఈ ఏర్పాట్లు అన్నీ చూసుకుంటూ ఉన్నాను. అయితే నెల కడచినా దురదృష్టవశాత్తు నాకు సహాయ పడగల మిత్రులు ఒక్కరూ దొరకలేదు. అప్పుడు షరీఫ్ భాయి తన పంతం నెగ్గించుకున్నారు. ఆ తరువాత మళ్ళీ సలహా మండలి సమావేశం, పబ్లికేషన్స్, పత్రికా ప్రతిపాదన, సర్వం హైదరాబాద్‌కు తరలింపు, వాటన్నింటి బాధ్యత నా పైనే పడటం– అన్నీ యధావిధిగా జరిగాయి!

## బలహీనుడి పైనే భారం!

సలహామండలిలో, వాదోపవాదాలు జరిగిన తరువాత అమీర్ హల్కా, మౌలానా అబ్దుల్ అజీజ్ గారు, ఇది తన తీర్పు అనీ ఆ పైన ఇక చర్చ జరగరాదనీ ప్రకటించారు, "పత్రికకు ఎడిటర్‌గా, పబ్లికేషన్స్‌కు సెక్రటరీగా మలిక్‌ని నియమిస్తున్నాను, పబ్లికేషన్స్ హైదరాబాద్‌లోనే ఉంటుంది" అని. అప్పుడు షరీఫ్ భాయి, "అల్ హమ్దులిల్లాహ్" అనుకుంటూ వచ్చి నన్ను కౌగిలించుకున్నారు, నాకు కన్నీరు ఆగలేదు!! నేను ఏదో విన్నవించుకోబోతే, ఇక ఏమీ పలక వద్దని, బిస్మిల్లాహ్ అని పని మొదలెట్ట వలసిందని నోరు మూయించారు మౌలానా! మౌలానా ముఖాన ఓ వైపున, చిరునవ్వు మరోవైపున చిరుకోపం దర్శనమిచ్చాయి!

తొలి పత్రిక 12.1.1979వ తేదీ నుంచి ప్రారంభించాలని, ఆ తొలి సంచిక 14.1.1979వ తేదీన విడుదల చేయాలని నిర్ణయించడం జరిగింది. ముఅజ్జమ్ జాహి మార్కెట్ రోడ్డులోని గాంధీ భవన్, ప్రకాశం హాల్లో ఆవిష్కరణ కార్యక్రమం పెట్టాలనీ నిర్ణయమయింది. మరుసటి రోజు నేను విజయవాడకు బయలుదేరాను. నాకు హైదరాబాద్‌లో ప్రింటింగ్ ప్రెస్‌లను గురించి ఏమీ తెలియదని, తొలి పత్రిక విజయవాడలోనే ప్రింట్ చేయించుకోవాలని అనుకున్నాము. అలాగే షరీఫ్ భాయి తొలి ఎడిటోరియల్ వ్రాస్తానని ఒప్పుకున్నారు. వ్రాశారు కూడా.

## లీడ్ ఆర్టికల్!

నేను అప్పటికప్పుడే ఫస్ట్ పేజీ లీడ్ ఆర్టికల్, ఏదో ఒకటి కాకుండా కాస్త థ్రిల్లింగ్ టాపిక్ కావాలని అప్పటి జనతా ప్రభుత్వం గురించి వ్రాశాను. దాని హెడ్డింగు పట్ల ఆ ప్రెస్ యజమాని, "మీరు చాలా సాహసం చేశారు సార్" అన్నారు. నేను లోలోనే నవ్వుకున్నాను. ఇతర వ్యాసాలూ విజయవాడలోనే వ్రాయడమో సమకూర్చుకోవడమో జరిగింది. లోగడ నేను వ్యాసాలు వ్రాయడం, అవి ప్రింట్ కావడం జరిగినా ప్రింటింగ్, దాని తాలూకు మెలుకువల పట్ల నాకు ఏ మాత్రం పరిచయం లేదు.

అదే ప్రింటింగ్ తతంగంతో నా ప్రథమ అనుభవం. ప్రూఫ్ రీడింగ్ కూడా నేర్చుకోవడం అదే మొదలు. ఆ లోపుగా కంపోజింగ్ పరికరాలన్నీ ప్యాక్ చేయించి హైదరాబాద్‌కు ట్రాన్స్ పోర్ట్ ద్వారా పంపే ఏర్పాటూ చేయించాను. ఆ తరువాత గీటురాయి తొలికాపీ బండల్ తీసుకుని హైదరాబాద్‌కు బయలుదేరాను. ఇంతకూ ఈ హడావిడి అంతటా షరీఫ్ భాయి నిండు సహకారం లభించింది!

## పత్రిక విడుదల

నేను హైదరాబాద్‌కు వచ్చిన తరువాత, నా అభిమాన సంపాదకులు శ్రీ నార్ల వెంకటేశ్వర రావు గారి చేత పత్రిక విడుదల చేయించాలన్న ఆశతో ఆయనకు ఫోన్ చేసి వెళ్ళాను. ఆయన ఎంతో మర్యాదగా కూచోబెట్టి వివరాలు అడిగారు. నేను చెప్పాను.

"అయితే ఇది మత పరమయిన పత్రిక అన్న మాట" అన్నారు ఆయన కాస్త సీరియస్‌గా.

"మేము ఇస్లామ్‌ను ఒక మతంగా కాదు, జీవన విధానమని నమ్ముతాము" అని బదులిచ్చాను.

ఆయన ముఖాన చిరునవ్వు దోబూచులాడింది, "నాకు తెలుసు, నావద్ద ఇస్లామ్‌కు సంబంధించిన పుస్తకాలు 150 ఉన్నాయి" అన్నారు.

నాకు లోలోనే మంట రేగింది, దాన్ని అణచివేసి, "అవును లేండి, అయినా వాటిని చదివే తీరిక ఎక్కడిదీ మీకు" అన్నాను.

ఆయన తటపటాయించారు, "అ.. అ." అంటూ ఉండిపోయారు.

ఒక్క క్షణం ఆగి "నో నాకు మతమంటే గిట్టదు, నేను రాలేను" అన్నారు.

ఆయనకు థాంక్స్ చెప్పి వచ్చేశాను. నాకు ఆయన వ్రాసే భాష, శైలి ఎంతగా ఇష్టమో ఆయన అవలంబించిన ఈ వైఖరి అంతే ఆయన పట్ల అయిష్టత కలిగించింది.

## గో.రా శాస్త్రి గారు

మరుసటి రోజు 'ఆంధ్రభూమి' సంపాదకులు, గో. రా శాస్త్రి గారిని కలవడానికి సికింద్రాబాద్ వెళ్ళాను. ఆయన వివరాలు విని, "చాలా మంచి విషయం చెప్పారు, తెలుగులో ఇస్లామ్‌కు సంబంధించిన పత్రిక వెలువరించడం శుభ సూచకం" అంటూ అభినందించారు. జమాఅత్ గురించి క్లుప్తంగా కొన్ని విషయాలు చెప్పాను. విని తప్పక వస్తానని వాగ్దానం చేశారు. నేను, విడుదల సంరంభంలో ఛీఫ్ గెస్ట్‌గా ఆహ్వానిస్తూ ఫార్మల్‌గా లెటర్ ముందే ఇచ్చి ఉన్నందు వల్ల, వాహనం పంపుతానని చెప్పాను. ఆయన, "అవసరం లేదు, నేను సమయానికి వచ్చేస్తాను" అని మాట ఇచ్చారు.

ఆ విధంగా గీటురాయి తొలి సంచిక విడుదల జనవరి 14వ తేదీన జరిగింది. ఆ వేడుకలో అప్పటి అమీర్ జమాఅత్ మౌలానా ముహమ్మద్ యూసుఫ్ గారు పాల్గొని పత్రిక విడుదల చేశారు. అది అప్పుడు టేబులాయిడ్‌గా వచ్చేది. నేనూ ఏదో మూడు ముక్కలు వెల్లడించాను. షరీఫ్ భాయి కూడా మాట్లాడారు. ఛీఫ్ గెస్ట్, గో.రా శాస్త్రి గారు మాటలాడుతూ ధార్మిక పత్రిక వెలువరించడం పట్ల, ఇంకా పత్రిక భాష పట్ల అభినందించడం తోపాటు మతాన్ని రాజకీయాలతో కలపడం పట్ల తన అయిష్టత వెలిబుచ్చారు. ముమ్ముందు ఈ విషయంలో జాగ్రత్త వహించాలి అనీ, వహిస్తారనీ ఆశాభావం వెలిబుచ్చారు.




*'గీటురాయి' వారపత్రిక తొలి సంచికను ఆవిష్కరిస్తున్న జమాఅతె ఇస్లామీ హింద్ అధ్యక్షులు మౌలానా ముహమ్మద్ యూసుఫ్. (చిత్రంలో)జమాఅతె ఇస్లామీ హింద్ ఏ.పీ& ఒడిషా అధ్యక్షులు మౌలానా అబ్దుల్ అజీజ్. జనాబ్ షేఖ్ హమీదుల్లాహ్ షరీఫ్*

## నిజమయిన గీటురాయి మాట!

ఆ తొలి సంచిక లీడ్ ఆర్టికల్ హెడ్డింగ్ "జనతాకు చరమ ఘడియలు" అన్నది. అదే పేజీలోని మరో హెడ్డింగ్ "గద్దె దిగకపోతే గ్రద్ద తన్నుకుపోతుంది" అన్నది. ఈ విషయం ఆధారంగానే శ్రీ గో. రా శాస్త్రి గారు పై విమర్శ చేశారు. ఆ విమర్శ పట్ల అమీర్ జమాఅత్, మౌలానా ముహమ్మద్ యూసుఫ్ గారు కూడా, తరువాత నన్ను ప్రశ్నించారు. ఆ కాలంలో సాధారణంగా మంచిని కోరుకునే వారెవరూ జనతా పార్టీని విమర్శించడాన్ని సహించేవారు కారు. కాని ఆ రోజుల్లో ఆ పార్టీలో కొనసాగే అంతర్గత కుర్చీల కుమ్ములాట నన్ను ఆ విధంగా హెచ్చరించడానికి పురికొలిపింది.

అయితే దేశంలో జరిగిన రాజకీయాలు మాత్రం గీటురాయి హెచ్చరికను రూఢీపరిచాయి! గీటురాయి అలా పలికి ఏడు నెలలు తిరగక మునుపే జనతా ప్రభుత్వం పడిపోవడం, మధ్యంతర ఎన్నికలు తప్పక పోవడం చకచకా జరిగాయి.

ఇంతకూ గాంధీ భవన్, ప్రకాశం హాల్లో జరిగిన ఆ గీటురాయి ఆవిష్కరణ సభలో స్త్రీ పురుషులు హాలు నిండా క్రిక్కిరిసి పాల్గొన్నారు, ఎంతోమంది నిలబడవలసి వచ్చింది కూడా!

ఆ విధంగా గీటురాయి మొదలయింది.

# విద్వేష రాజకీయాలు ప్రమాదంలో ప్రజాస్వామ్య సౌధం!

- ముహమ్మద్ అజీజుద్దీన్

**భారత రాజకీయాలు** నేడు ఒక తీవ్రమైన మలుపు వద్ద నిలబడి ఉన్నాయి. ఒకప్పుడు రాజకీయాలు అంటే ప్రజాసేవ, సామాజిక సమస్యల పరిష్కారం, విలువలతో కూడిన చర్చ. నాయకులు ప్రజలను ఐక్యం చేసేవారు, దేశాన్ని జాగృతపరిచే చైతన్యాన్ని రగిలించేవారు. కానీ నేడు ఆ పాత ఒడంబడిక తెగిపోయింది. దాని స్థానంలో, విభజన రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందాలన్న ఒకే ఒక్క లక్ష్యంతో, కొందరు నాయకులు సమాజంలో విద్వేషపు మంటలను రాజేస్తున్నారు. ఈ కొత్త ధోరణి మన ప్రజాస్వామ్య సౌధాన్ని మాత్రమే కాదు, పౌరుల మధ్య ఉన్న పరస్పర విశ్వాసపు పునాదిని కూడా పెకలించి వేస్తోంది.

## ఎన్నికల అజెండాలో అభివృద్ధికి స్థానమెక్కడ?

ముఖ్యంగా తెలంగాణ రాజకీయాల్లో, ఇది ఒక ఆందోళనకరమైన దృశ్యం. రాష్ట్రంలోని బీజేపీ నాయకుల మాటతీరుపై వస్తున్న విమర్శలను కేవలం రాజకీయ విమర్శలుగా కొట్టిపారేయలేం. బండి సంజయ్ వంటి కీలక నాయకులు సందర్భాన్ని బట్టి మతాలను పోల్చుతూ, లేదా ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటూ చేసే వ్యాఖ్యలు... ప్రజల్లో ఉద్దేశపూర్వకంగా విద్వేషాన్ని నాటే వ్యూహంలో భాగమా? అనే ప్రశ్న నేరుగా మన కళ్ల ముందు నిలుస్తోంది.

జూబ్లీహిల్స్ వంటి అభివృద్ధి ప్రధానమైన నియోజకవర్గాల్లో కూడా ఈ చీకటి ధోరణి స్పష్టంగా కనిపించింది. నిరుద్యోగం, ట్రాఫిక్, అభివృద్ధి కొరత, విద్య, వైద్యం– ఇవే ప్రధాన చర్చలు కావాల్సిన సమయంలో, ఆ సమస్యల పరిష్కారానికై బదులు మతపరమైన భావోద్వేగాలను కేంద్ర బిందువుగా మార్చే ప్రయత్నం ఎందుకు? కిషన్ రెడ్డి వంటి కీలక నాయకుల ప్రాతినిధ్యంలో సైతం, ప్రజలు ఆశించిన అభివృద్ధి చర్చ పక్కనపడిపోయి, మతపరమైన మాటలు ముందుకు రావడం... ఇది ఎన్నికల అజెండాను దారుణంగా పక్కదారి పట్టిస్తున్న చర్య కాదా?

## ద్వేష భాష: సైలెంట్ కిల్లర్

విద్వేష భాష (Hate Speech) అనేది కేవలం నోటి మాట కాదు, అది మన సామాజిక సామరస్యాన్ని నిర్వీర్యం చేసే విషం. ఇది ఎంత ప్రమాదకరమంటే:

❖ **ప్రజాస్వామ్య విధ్వంసం :** ప్రజాస్వామ్యం పరస్పర గౌరవం, సమానత్వంపై ఆధారపడుతుంది. నాయకుడు తన స్వలాభం కోసం ప్రజలను విడగొడితే, అది నేరుగా ప్రజాస్వామ్య స్ఫూర్తిని చంపుతుంది.

❖ **యువతకు ప్రమాదం :** సోషల్ మీడియా యుగంలో, నాయకులు మాట్లాడే ఒక్క వాక్యం కూడా ఫిల్టర్ లేకుండా లక్షల మంది యువత మనసుల్లోకి దూసుకెళ్తోంది. ఇది వారిలో అనుమానాలు, అవిశ్వాసం, చివరకు విద్వేష మనస్తత్వాలను పెంచి, శాంతి వాతావరణాన్ని దెబ్బతీస్తుంది.

❖ **సామాజిక బంధాల బలహీనత :** భిన్న మతాలు, వర్గాలు, జాతులు కలిస్తేనే దేశం. ఒక వర్గాన్ని మరొక వర్గానికి శత్రువుగా నిలబెట్టే రాజకీయాలు అంతర్గత బంధాలను బలహీనపరిచి, ఘర్షణలకు దారి తీస్తాయి.

బండి సంజయ్ ప్రసంగాల్లో తరచుగా కనిపించే 'మత రాజకీయాల ద్వారా మద్దతు పొందడం' అనే వ్యూహం... కేవలం తెలంగాణకే పరిమితం కాదు, ఇది దేశవ్యాప్తంగా వ్యాపిస్తున్న రాజకీయ సంస్కృతికి అద్దం పడుతోంది. ఎన్నికలు సమీపించగానే అభివృద్ధి చర్చ పక్కనపడి, విభజన కథనాలు, విద్వేషపూరిత భాష పెరగడం దేశ భవిష్యత్తుకు శుభ సూచకం కాదు.

## నాయకులారా, బాధ్యత మరవకండి!

ఇలాంటి క్లిష్ట సమయాల్లో రాజకీయ నాయకుల బాధ్యత ఇంకా పెరుగుతుంది. నాయకులు ప్రజల ముందు కేవలం రాజకీయ నేతలుగా కాదు, ఆదర్శంగా నిలబడాలి. వారి మాటలు ప్రజలను ఐక్యం చేసేలా ఉండాలి. ప్రజల నిజమైన సమస్యలు నిరుద్యోగం, ధరలు, విద్య, వైద్యం, అభివృద్ధి– ఇవే వారి రాజకీయాలకు పునాది కావాలి. మతపరమైన విభజన వాక్యాలను ఉద్దేశపూర్వకంగా ప్రయోగించడం అనేది కేవలం నైతిక తప్పిదం మాత్రమే కాదు, ప్రజాస్వామ్య విలువలకు తీవ్రమైన ద్రోహం.

## పౌరులారా, అప్రమత్తంగా ఉండండి!

విద్వేషాన్ని రెచ్చగొట్టే మాటలపై వెంటనే స్పందించకుండా, దాని వెనుక ఉన్న రాజకీయ స్వార్థాన్ని అర్థం చేసుకోండి. విద్వేష భాషకు మన సమాజంలో స్థానం లేదని గట్టిగా డిమాండ్ చేయండి.

మతం, జాతి, వర్గం అనేవి ఒక దేశపు అందం. అభివృద్ధి, సామరస్యం, శాంతి– ఇవే నిజమైన రాజకీయాల పునాది. ఈ విలువలను కాపాడుకోవడం అనేది రాజకీయ నాయకుల, ప్రజల, ప్రతి పౌరుడి అంతిమ బాధ్యత. విభజన గోడలను కూల్చి, ఐక్యతను పెంపొందించే రాజకీయ నాయకుల వైపు నిలబడాల్సిన సమయం ఆసన్నమైంది!

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది　　ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

38 ఆయత్‌లు

# 47. ముహమ్మద్

మదీనా అవతరణ

9 – 12 ఎందుకంటే వారు, అల్లాహ్ అవతరింపజేసిన దాని పట్ల అయిష్టత కనబరచారు.[14] కనుక అల్లాహ్ వారి ఆచరణలను వృధాపరిచాడు. వారు భువిలో తిరుగాడలేదా, తమకు పూర్వం గతించిన వారి అంతిమ పరిణామం చూడలేదా? వారికి చెందినదంతా అల్లాహ్ వారిపైనే త్రిప్పివేశాడు, ఇటువంటి పర్యవసానాలే ఈ తిరస్కారులకు విధితమయి ఉన్నాయి.[15] ఇది ఎందుకంటే విశ్వసించినవారిని ఆదుకునేవాడు సహాయకుడయితే అల్లాహ్ ఉన్నాడు, మరి తిరస్కారులను ఆదుకునేవాడు, సహాయకుడు ఎవడూ లేడు.[16] విశ్వసించే వారినీ, సత్కార్యాలాచరించేవారిని అల్లాహ్, దిగువన కాలువలు ప్రవహించే స్వర్గాలలో ప్రవేశింపజేస్తాడు, మరి తిరస్కారానికి ఒడిగట్టేవారు మటుకు కేవలం ఇహలోకపు మూన్నాళ్ళ జీవితం మజాలే జుర్రుకుంటున్నారు, పశువుల్లా తింటూ త్రాగుతూ గడుపుతున్నారు,[17] వారి అంతిమ నివాసం నరకమే.

13 – ప్రవక్తా, ఎన్నో జనావాసాలు గతించాయి, అవి నీ స్వగ్రామం, నిన్ను వెళ్ళగొట్టిన గ్రామం కన్నా ఎంతో బలోపేతమయినవి. మేము వారిని అంతమొందించగా వారిని కాపాడే వాడెవడూ లేకపోయాడు.[18]

14. అంటే, వారు తమ ప్రాచీన అజ్ఞానపూర్వకమయిన మూఢ భావాలు, ఆలోచనలు, ఆచార వ్యవహారాలు, నైతిక రుగ్మతలకే ప్రాధాన్యతనిచ్చారన్నమాట. అల్లాహ్ వారికి సన్మార్గం చూప డానికి అవతరింపజేసిన బోధనల్ని ఇష్టపడలేదన్నమాట.

15. ఈ వాక్యానికి రెండు అర్థాలున్నాయి. ఒకటి, ఆ తిరస్కారులు ఏ వినాశాన్ని ఎదుర్కొన్నారో అటువంటి వినాశమే ఇప్పుడు మహనీయ ముహమ్మద్(స) సందేశాన్ని అంగీకరించని ఈ తిరస్కారులకూ విధితమయిపోయింది అన్నది. రెండవది, వారి వినాశం కేవలం ప్రాపంచిక యాతనతో ముగియలేదు. నిజానికి ఇదే వినాశం వారి కోసం పరలోకంలోనూ విధిత మయి ఉంది అన్నది.

16. ఉహుద్ పోరాటంలో ప్రవక్త మహనీయులు (స) గాయ పడి కొందరు సహచరులతో పాటు ఒక కొండ మీద ఉండగా అబూ సుఫ్యాన్ ఇలా నినదించాడు "మాకు ఉజ్జా (దేవత) ఉంది, మీకు ఏ ఉజ్జా లేదు." అప్పుడు ప్రవక్త మహనీయులు (స) తన సహచరులకు చెప్పారు, ప్రతిగా పలకండి, "అల్లాహ్ మా సంరక్షకుడు, మీకు సహాయకుడూ సంరక్షకుడు ఎవడూ లేడు." ప్రవక్త(శ్రీ (స) ఇచ్చిన ఈ సమాధానం ప్రస్తుత ఆయత్ నుండి గ్రహించినదే.

17. అంటే, ఏ విధంగానయితే జంతువు వింటుందే తప్ప ఈ ఆహారం ఎక్కడి నుండి ప్రాప్తమయిందో, ఎవరు సృష్టిం చిందో, ఈ ఆహారం వల్ల తన పైన తారసిల్లే ఈ ఉపాధి ప్రదాత హక్కు లేవో అని ఆలోచించదో, అదేవిధంగా ఈ జనులు సయితం తింటూ పోతున్నారే తప్ప, మేయడం, మెక్క డానికి మించి ఏ విషయమూ వీరు పట్టించుకోవడం లేదు.

18. దైవ సందేశహరులు (స) మక్కా నుండి వెళ్ళడం పట్ల చాలా బాధపడ్డారు. హిజ్రత్‌కు బయలుదేరడం తప్ప గత్యంతరం లేకపోయేసరికి ఆయన నగరం వెలుపలికి వచ్చిన తరువాత, నగరం వైపునకు మరలి, "మక్కా, ప్రపంచ నగరాల లోకెల్లా, నీవు అల్లాహ్‌కు ఎంతో ప్రీతిపాత్రమయినదానివి, దేవుని సకల నగరాలలో అన్నింటికన్నా నాకు నీవంటేనే అధిక ప్రేమ. బహుదైవారాధకులు నన్ను వెలికి తీయకపోయి నట్లయితే నేను నిన్ను వదలి ఎన్నడూ వెళ్ళేవాణ్ణి కాను" అని అన్నారు. దీన్ని పురస్కరించుకునే ఇలా సెలవీయడం జరిగింది, మక్కావాసులు నిన్ను వెలికి పంపి, తాము ఏదో ఘనకార్యం సాధించామని తమంతట భావిస్తున్నారేమో, నిజానికి ఈ చేష్టవల్ల వారు తమ శాస్తిని కొనిదెచ్చుకున్నారు. ఆయత్‌లో భావప్రకటనా విధానం స్పష్టంగా చెబుతోంది, ఇది ఖచ్చితంగా, హిజ్రత్ వెనువెంటనే అవతరించి ఉంటుంది అని.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

**అడుగు జాడలు**

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**

**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ التَّفْسِيرِ

## ఖుర్ఆన్ వ్యాఖ్యాన ప్రకరణం

**(కితాబుత్తఫ్సీర్)**

**2. అల్ బఖరా**

### అధ్యాయం : 34

### అరఫాత్‌లో ఆగటమే అసలు హజ్జ్

“తరువాత ప్రజలంతా ఏ స్థలం నుండి వెనుకకు మరలుతారో, అదే స్థలం నుండి మీరూ మరలండి.” (2: 199)

**369)** ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ ఆయిషా సిద్దీఖా (ర.అ) తెలిపారు: ఖురైషులు, వారి అడుగుజాడలలో నడుచుకునే అరబ్బులు (హజ్జ్ కాలంలో) **‘ముజ్‌దలిఫా’** లోనే విడిది చేసేవారు. దానికి వారు ‘హమస్’ అని నామకరణం చేశారు. మిగిలిన అరబ్బులు మాత్రం **‘అరఫాత్’** మైదానంలోనే ఆగేవారు. ఇస్లామ్ వచ్చిన తరువాత అల్లాహ్ తన సందేశహరునికి ఆజ్ఞాపిస్తూ, “మీరు (తొలుత) ‘అరఫాత్’కు రావాలి, అక్కడ ఆగాలి, ఆపైన ‘ముజ్‌దలిఫా’కు మరలి రావాలి”[1] అని సెలవిచ్చాడు. అల్ బఖరా సూరా 199వ ఆయత్‌లోని అంతరార్థం ఇదే.

**370)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) ఇలా వివరించి చెప్పారు: ‘తమత్తు’ సంకల్పం చేసుకున్నవారు ‘ఉమ్రా’ చేసిన పిదప ఇహ్రామ్‌ను విడువాలి. వారు హజ్జ్ నిమిత్తం ఇహ్రామ్ కట్టుకోనంత వరకూ బైతుల్లాహ్ ప్రదక్షిణ (నఫిల్‌గా) చేస్తూ ఉండాలి. మరి వారు హజ్జ్ కొరకు ఇహ్రామ్ కట్టుకుని, అరఫాత్‌కు బయలు దేరిన మీదట ఇవ్వగలిగిన ఖుర్బానీ ఇవ్వాలి– అది ఒంటె అయినాసరే లేదా ఆవు లేదా మేక అయినా సరే– ఈ మూడింటిలో తమకు అందుబాటులో ఉన్న పశువును ఖుర్బానీగా సమర్పించుకోవాలి. ఒకవేళ ఖుర్బానీ పశువు లేనివారు హజ్జ్ దినాలలో మూడు రోజులపాటు ఉపవాసం ఉండాలి. అరఫా దినానికి పూర్వం ఒకవేళ చివరి ఉపవాసం అరఫా దినాన వచ్చినా అందులో దోషం ఏమీ లేదు. మక్కా నగరం నుండి అరఫాత్‌కు నడిచి వెళ్ళాలి. అక్కడ (అరఫాత్‌లో) అస్ర్ నమాజ్ మొదలుకుని రాత్రి చీకటి అలుముకునే వరకూ ఆగాలి. ప్రజలు అరఫాత్ నుండి మరలినప్పుడు, వారితోపాటు మరలి రాత్రి ముజ్దలిఫాలో గడపాలి. అల్లాహ్‌ను స్మరిస్తూ, తక్బీర్లు, తహ్‌లీల్ అత్యధికంగా పలుకుతూ ఉండాలి. తెల్లవారే వరకూ ఇలా గడపాలి. తెల్లవారాక జనులతోపాటే ముజ్దలిఫా నుండి ‘మినా’కు తిరిగి రావాలి. అక్కడ (మినాలో) కంకరరాళ్ళు రువ్వే వరకూ అల్లాహ్‌ను అత్యధికంగా స్మరిస్తూ, అల్లాహ్ గొప్పతనాన్ని కీర్తిస్తూ ఉండాలి.

**371)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఈ విధంగా వేడుకునే వారని అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖించారు: **“అల్లాహుమ్మ రబ్బనా ఆతినా ఫిద్దున్‌యా హసనతన్ వ ఫిల్ ఆఖిరతి హసనతఁ వ్వఖినా అజాబన్నార్”** (మా ప్రభూ! మాకు ప్రపంచంలోనూ మేలును ప్రసాదించు. పరలోకంలో కూడా మేలును వొసగు. మమ్మల్ని నరక యాతన నుండి కాపాడు)[1]

369-1. అంటే ఖురైషులకు కూడా అరఫాత్ మైదానంలో ఆగాలని ఆజ్ఞాపించటం జరిగింది. ‘హమస్’ అంటే ధర్మావలంబనలో దృఢంగా, ఖచ్చితంగా ఉండేవారని అర్థం. ఖురైషులమైన తాము పవిత్ర కాబా సేవకులమని, హరమ్(పుణ్యక్షేత్రం) పరిధులకు అవతల తాము వెళ్ళరాదని, అరఫాత్ మైదానం పుణ్యక్షేత్రం పరిధికి వెలుపల ఉందని వారు తలపోసేవారు. ఖురైషుల ఈ తప్పుడు ఆలోచనలను సంస్కరించటం జరిగింది. హాజీలంతా అరఫాత్‌లో ఆగటం తప్పనిసరిగా ఖరారు చేయటం జరిగింది.

371-1. ఈ దుఆ మహత్పూర్వకమైనది. అత్యధికంగా ఇలా వేడుకుంటూ ఉంటే, అది ఇహంలోనూ, పరంలోనూ శుభాలకు దోహదకారి అవుతుంది.



# తల్లిదండ్రుల సేవలో తరిద్దాం!

- సయ్యద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**అమ్మానాన్నలు...** ఈ రెండు పదాలు కేవలం వ్యక్తులు కాదు, అవి అనుబంధానికి, అనురాగానికి, ఆత్మీయతకు నిలువెత్తు రూపాలు. ఈ సృష్టిలో వారిని మించిన అమృతమూర్తులు లేరు. తమ పిల్లలను ఉన్నత శిఖరాలకు చేర్చడానికి, తమ సుఖసంతోషాలను తృణప్రాయంగా త్యాగం చేసే మహోన్నత వ్యక్తులు వారు. మన చిరునవ్వు కోసం తమ కష్టాలన్నింటినీ మరచిపోయే ఆ తల్లిదండ్రుల ఋణం తీర్చుకోలేనిది.

అయితే, మన జీవితంలో తల్లిదండ్రుల స్థానం కేవలం భావోద్వేగాలకే పరిమితం కాదు. ఇది దైవ ఆజ్ఞగా, మన నైతిక బాధ్యతగా పవిత్ర ఖురాన్, హదీసులలో స్పష్టంగా చెప్పబడింది.

## దైవారాధన తర్వాత తల్లిదండ్రులకే తొలి ప్రాధాన్యం

మన సృష్టికర్తయైన అల్లాహ్ తన ఆరాధన తర్వాత రెండవ స్థానంలోనే తల్లిదండ్రుల పట్ల సద్వర్తనతో మెలగాలని ఆదేశించాడు.

"మీరు అల్లాహ్‌నే ఆరాధించండి. ఆయనకు (దైవత్వంలో) ఎవరినీ సాటి కల్పించకండి. తల్లిదండ్రుల పట్ల సద్వర్తనంతో వ్యవహరించండి" (అన్-నిసా: 36)

ఈ ఆదేశం ఎంత పవిత్రమైనదో తెలుసుకోవడానికి పవిత్ర ఖురాన్ అన్-నిసా: 36, లుఖ్మాన్: 14, అల్-బఖరహ్: 43 ఆయతులను అవిభాజ్యాలుగా పేర్కొనడం గమనించాలి. అల్లాహ్‌కు కృతజ్ఞత చూపినప్పటికీ, తల్లిదండ్రులకు కృతజ్ఞత చూపకపోతే ఆ కృతజ్ఞత అంగీకరించబడదని స్పష్టమవుతోంది. అల్లాహ్ తరువాత అన్నిటికన్నా గొప్ప హక్కు తల్లిదండ్రులదే!

## వృద్ధాప్యంలో విసుగు వద్దు!

ముఖ్యంగా, తల్లిదండ్రులు వృద్ధులై, బలహీనులై, నిస్సహాయులై ఉన్నప్పుడు వారి సేవలో మన సహనం, దయ ఎంతో అవసరం. ఆ సమయంలో వారిని 'ఉఫ్' అని కూడా విసుక్కో కూడదు. కసురుకుంటూ విదిలించి మాట్లాడకూడదు.

"మీ ముందు వారిద్దరిలో ఎవరైనా వృద్ధులై ఉంటే వారిని 'ఉఫ్' అని కూడా విసుక్కోకండి. కసురుకుంటూ విదిలించి మాట్లాడకండి. వారితో గౌరవంగా మాట్లాడండి"

(బనీ ఇస్రాయీల్: 23)

దయార్ద్ర హృదయంతో, వినయంతో వారి ముందు తలవంచి, "ప్రభూ! వీరు నన్ను చిన్నతనంలో ఎలా కరుణతో,

వాత్సల్యంతో పెంచి పోషించారో, అలా నీవు వీరిని కరుణించు'' అని ప్రార్థించాలి. ఈ మాత్రం ఓపికను, సేవా నిరతిని కనబరచినవాడే దైవసన్నిధిలో ప్రీతిపాత్రుడవుతాడు.

### కేవలం డబ్బు కాదు - కావలసింది ప్రేమ, సమయం!

తల్లిదండ్రుల పట్ల విధేయత అంటే కేవలం డబ్బు ఇవ్వడం లేదా కూడు, గూడు, గుడ్డ సమకూర్చడం మాత్రమే కాదు. అంతకుమించి, వారికి కావాల్సింది:

➢ ప్రేమ, కరుణ, మమకారంతో వారితో సమయం గడపడం.

➢ వెట్టి చాకిరీ చేసి వాడిపోయిన వారి పెదాలపై చిరునవ్వులు తెప్పించే మృదువైన నాలుగు మాటలు.

➢ వారిని ఆప్యాయతతో ఆలింగనం చేసుకునే బాహులు.

➢ ముడతలు పడిన వారి చేతులు-కాళ్ళను మమకారంతో ముద్దాడే పెదాలు.

తల్లిదండ్రులు వద్దు అని చెప్పినా, వారి అవసరాలను తెలుసుకుని, ప్రేమగా, తరచుగా కానుకలు ఇస్తూ వారిని సంతోషపెట్టండి.

### తల్లిదండ్రులే మన స్వర్గం, నరకం

దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చిన మాటలు మనందరినీ ఆలోచింపజేయాలి:

''తల్లిదండ్రులే మీ స్వర్గం, తల్లిదండ్రులే మీ నరకం.''

వారు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు వారిని సంతోషపెట్టి సేవ చేయలేనివాడు స్వర్గాన్ని కోల్పోతాడు. వారిని కష్టపెడితే, దైవాగ్రహానికి గురై నరకానికి ఆహుతి అవుతాడు.

తల్లిదండ్రులను దూరం చేసుకుని, వృద్ధాశ్రమాల పాలు చేసే నేటి దుర్భర పరిస్థితిని మనం ప్రశ్నించుకోవాలి. తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత మనదే.

### తల్లిదండ్రుల విధేయత- ప్రయోజనాలు

తల్లిదండ్రుల పట్ల విధేయత చూపడం వల్ల లభించే ప్రతిఫలాలు ఎన్నో:

**1. దైవప్రసన్నత :** ''అల్లాహ్ ప్రసన్నత తల్లిదండ్రుల సంతోషం లోనే ఉంది.''

**2. కష్టకాలంలో రక్షణ :** గుహలో చిక్కుకున్న ముగ్గురు వ్యక్తుల గాథలో, తల్లిదండ్రుల సేవ ద్వారానే బండ రాయి కదిలి, వారు విముక్తి పొందారు.

**3. పాపాల ప్రాయశ్చిత్తం (కఫ్ఫారా) :** తల్లిదండ్రుల పట్ల విధేయత పెద్ద పాపాలకు ప్రాయశ్చిత్తంగా పనిచేస్తుందని ఇమామ్ అహ్మద్ (రహ్మ) అన్నారు.

**4. సజ్జన సంతానం :** ప్రవక్త ఇబ్రాహీం (అలైహిస్సలాం) తన తండ్రి యెడల చూపిన కరుణ ఫలితంగానే, విధేయుడైన కుమారుడు ఇస్మాయీల్ (అలైహిస్సలాం) కలిగారు.

తల్లిదండ్రులు జీవించి లేకపోయినా, వారి పేరిట దాన ధర్మాలు చేయడం, వారి అప్పులు తీర్చడం, వారి బంధు మిత్రులను గౌరవించడం, వారి కోసం ప్రార్థించడం ద్వారా మనం వారి సేవను కొనసాగించవచ్చు.

''ఇస్ పేడ్ కా సాయా మేరే బచ్చోఁ కో మిలేగా'' (ఈ చెట్టు నీడ నా పిల్లలకు దొరుకుతుందని ఈ తల్లిదండ్రుల సేవ చేస్తున్నాను) అన్నట్లుగా, మనం మన తల్లిదండ్రులను ఎలా చూసుకుంటామో, మన భవిష్యత్తు కూడా అదే విధంగా ఉండబోతోంది.

అల్లాహ్‌కు విధేయత చూపుతూ, మన తల్లిదండ్రుల సేవలో తరిద్దాం! వారి మనసు కష్టపెట్టకుండా, వారి ఆనందంలోనే మన సంతోషాన్ని వెతుక్కుందాం. అదే మనకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ శాంతిని, స్వర్గాన్ని ప్రసాదించే దివ్యమార్గం.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

పెంకుటిళ్ళ మధ్య సాగే ఒక చిన్న బస్తీ. అప్పుడు నేను అమ్మ, అక్కాచెల్లెళ్ళు, మేనల్లుళ్ళతో కలిసి విద్యాభ్యాసం కోసం అద్దెకు ఉన్నాము. మా ఇల్లు ఎత్తైన డాబాపై ఉండేది.

కింది సందులో, మా డాబా అంచున ఆనుకుని, ఇలియాస్ సాహెబ్ గారి ఇల్లు ఉండేది. తరతరాలుగా అక్కడ గాజుల వ్యాపారం చేసుకునే కుటుంబం వారిది. మా ఇంటి దారి, వారి ఇంటి దారి వేరు. కానీ, పై కప్పు మీద నిలబడితే, వారి వంటపాత్రల చప్పుళ్ళు, మా ఇంటి అరుగు పలకరింపులు వినిపించేంత దగ్గరగా ఉండేది మా పొరుగుతనం.

ఇలియాస్ సాహెబ్ కూతురు, నజ్మా, మా అక్కలతో చెలిమి కట్టింది. అది పైపై స్నేహం కాదు, అరబీ నేర్చుకోవడంలో, కష్టసుఖాలు పంచుకోవడంలో మా అక్కలు నజ్మాకు తోడుగా నిలిచేవారు. పొరుగున ఉన్నాం కాబట్టి, వారికి ఏ కష్టం వచ్చినా చేదోడు వాదోడుగా ఉండటం మా బాధ్యతగా భావించేవాళ్ళం.

## పెండ్లి సందడిలో పంతం

నజ్మా పెళ్ళి కుదిరింది. ఇంట్లో సందడి మొదలైంది. మా అమ్మగారు, నజ్మా కోసం స్వయంగా తానే ఎంపిక చేసినట్టుగా, రంగుల పట్టు పరికిణిని కానుకను సిద్ధం చేశారు.

శుభఘడియ రానే వచ్చింది. సాయంత్రం వేళ, పెళ్ళి వేదిక దగ్గర వేడుక మొదలవుతోంది. కానీ, అంతకంటే ముందే, ఇలియాస్ సాహెబ్ ఇంటి వైపు నుంచి భరించలేని శబ్దాలు మా ఇంటిని కుదిపేశాయి. డిజే సౌండ్ పెట్టి, లౌడ్ స్పీకర్లను చింపేస్తున్నట్టుగా పాటలు! ఆ హడావిడి, ఆ మోత విన్న వెంటనే నా మనసు కలవరపడింది.

మా అమ్మగారు దీర్ఘంగా నిట్టూర్చారు. “ఇది శుభకార్యం నాయనా. దేవుడి దయ, శుభాలు ఉండాలి. ఈ అల్లరి, అపశ్రుతి దేవుడికి నచ్చేది కాదు. ఈ శుభవేళ ఇలాంటి దైవానికి విరుద్ధమైన పనుల్లో పాలుపంచుకోవడం ధర్మం కాదు,” అన్నారు.


వెంటనే, ఇలియాస్ సాహెబ్ మా తలుపు దగ్గరకు వచ్చారు. పెళ్ళి ఉత్సాహం, పొరుగు ప్రేమ రెండూ ఆయన కళ్ళల్లో కనిపించాయి.

“అహ్మద్ బాబూ! లోపల మీరంతా ఇంకా సిద్ధం కాలేదేంటి? నికాహ్ టైమ్ దగ్గర పడుతోంది. నజ్మా మీరంతా వస్తేనే లోపలికి వస్తానని కూర్చుంది! త్వరగా రండి!”

నేను వారికి సలామ్ చేసి, మా అమ్మ ప్రేమగా అందించిన కానుకను ఇచ్చాను.

“మామూ! క్షమించండి. మాకు అనుకోకుండా ఊహించని ఇబ్బంది వచ్చింది. అత్యవసరమైన పనుల వల్ల మేము పెళ్లికి

కథ



# విశ్వాసం గెలిచింది

**- మైమూనా ఫాతిమా**

రాలేకపోతున్నాము. దయచేసి మా కోసం ఆగిపోవద్దు. మేము మీ పెళ్ళి వేడుకలో లేకపోయినా, మా ఆశీస్సులు, దీవెనలు నజ్మాకు ఎప్పుడూ ఉంటాయి.”

ఆయన ముఖం ఒక్కసారిగా మాడిపోయింది. “ఏం జరిగింది? మీరు రాకపోతే ఎలా? ఏ కారణం చేత రావట్లేదో నిజం చెప్పండి!” అని కొంచెం గట్టిగానే అడిగారు.

వారు పట్టుబట్టడంతో, నాకు తప్పలేదు. “మామూ, ఈ కోలాహలం, ఈ లౌడ్ స్పీకర్ల మోత, ఈ వేడుక మా విశ్వాసానికి, మా ధర్మానికి విరుద్ధం. పుణ్యం దక్కాల్సిన ఈ శుభకార్యం ఇలా పాపకార్యంతో మొదలవడం మాకు నచ్చలేదు. అందుకే రాలేకపోతున్నాం,” అని నమ్రతగా చెప్పాను.

ఆయన కోపంతో, కొంచెం నిరాశగా మాట్లాడుతూ, “పిల్లలు

ఆనందంగా ఉంటే పోయేది ఏముంది? మరి హకీమ్ బాబాయ్ ఇంట్లో ఇలాంటివే జరిగితే, మీరు అక్కడికీ వెళ్లరా? పెద్ద మనుషులకు ఒక న్యాయం, మాకు ఒక న్యాయమా?" అని సవాలు విసిరారు.

"మామూ, ధర్మానికి, దైవం ఆజ్ఞకు హకీమ్ బాబాయ్ అయినా, నేనైనా లోబడాల్సిందే. అక్కడ జరిగినా, మా విశ్వాసం మారదు. మా ఇబ్బంది ఇదే," అన్నాను.

### పట్టుదలకు దక్కిన దీవెన

ఆయన నిరాశగా, బాధతో వెనుతిరిగారు. గిఫ్టు కూడా తీసుకెళ్లలేదు.

సుమారు అరగంట గడిచింది. బయట నిశ్శబ్దం. లౌడ్ స్పీకర్ల మోత మాయమైంది.

ఇలియాస్ సాహెబ్ మళ్ళీ వచ్చారు. ఈసారి ఆయన ముఖంలో నిజాయితీ కనిపించింది.

"అహ్మద్ బాబూ!" ఆయన గొంతులో పశ్చాత్తాపం ఉంది. "మీరు చెప్పింది నూటికీ నూరుపాళ్ళు నిజం. నా కూతురి జీవితంలో ఇంత పెద్ద ఘట్టం... దైవ కారుణ్యంతో మొదలవ్వాలి. వెళ్ళి డిజే మోత ఆపించేశాను. ఇప్పుడు ఒక్క పాట, ఒక్క అల్లరి లేదు. దయచేసి... మీరు రండి. మీరు రాకుండా మా పెళ్ళి వేదిక వెలితిగా ఉంది. మీ దీవెనలు, మీ పెద్దరికం మాకు కావాలి," అని చేతులు జోడించారు.

ఆయన తీసుకున్న ఆ నిర్ణయం, ఆయన చూపిన ఆ పొరుగు గౌరవం మా మనసులను తాకాయి. మా కళ్ళల్లో సంతోషం ఉప్పొంగింది.

నేను, అమ్మగారు, అక్కాచెల్లెళ్ళు అందరం పెళ్ళి పందిరి దగ్గరికి వెళ్ళాం. ఆ వాతావరణం పవిత్రంగా, శాంతంగా ఉంది. ఆ రాత్రి, నజ్మాకు, ఆమె భర్తకు మా హృదయపూర్వక శుభాకాంక్షలు అందించాం.

ఈ సంఘటన తర్వాత, మా పొరుగు బంధం మరింత బలపడింది. పాలు నీళ్ళలా కలిసిపోయాం. నిజమైన పొరుగు ధర్మం అంటే, ఒకరి క్షేమాన్ని కోరుకోవడమే కాదు... ఒకరినొకరు మంచి దారి వైపు నడిపించడం అని ఇలియాస్ సాహెబ్ అర్థం చేసుకున్నారు.

## వక్ఫ్ ఆస్తుల డిజిటలైజేషన్: 'ఉమీద్' నిరాశపరిచిందా?

వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, రక్షణ కల్పించాలనే సదుద్దేశంతో కేంద్రం తీసుకువచ్చిన 'ఉమీద్ పోర్టల్' వ్యవహారం ప్రస్తుతం గందరగోళానికి దారితీసింది. ఆస్తుల డిజిటలైజేషన్‌కు ఆరు నెలల గడువు విధించి, డిసెంబరు 6తో పోర్టల్‌ను మూసివేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### సంఖ్యలు చెబుతున్న సగం నిజాలు:

కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, గడువు ముగిసే నాటికి పోర్టల్‌లో 5,17,040 ఆస్తుల వివరాలు నమోదయ్యాయి. కానీ, ఇందులో ఇప్పటివరకు ధ్రువీకరణ పొందినవి కేవలం 2,16,905 మాత్రమే. అంటే, దాదాపు 60% పైగా ఆస్తుల వివరాలు ఇంకా ధ్రువీకరణ దశలోనే ఉన్నాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్ (92,830), మహారాష్ట్ర (62,939) నుంచి రిజిస్ట్రేషన్లు జరిగాయి.

### అసంపూర్ణ లక్ష్యం, అంధకారంలో భవితవ్యం:

వక్ఫ్ ఆస్తుల సంఖ్య దేశవ్యాప్తంగా సుమారు 8.7 లక్షలుగా అంచనా వేయగా, ఉమీద్ పోర్టల్‌లో కేవలం సగం ఆస్తులు మాత్రమే నమోదు కావడం, వాటిలోనూ కేవలం 25% మాత్రమే ధ్రువీకరణ పూర్తి కావడం ఈ ప్రక్రియ వైఫల్యాన్ని స్పష్టంగా సూచిస్తోంది. ముఖ్యంగా మధ్యప్రదేశ్, కేరళ వంటి వక్ఫ్ సంపన్న రాష్ట్రాల్లో అప్‌లోడ్ రేటు దారుణంగా 1% కంటే తక్కువగా ఉండటం ఈ పథకం అమలులో ఉన్న సాంకేతిక, పరిపాలనా లోపాలకు అద్దం పడుతోంది.

### గడువు పొడిగించని బాధ్యతారాహిత్యం:

వక్ఫ్ ఆస్తుల యాజమాన్య పత్రాలు, ఇతర వివరాలను సేకరించి అప్‌లోడ్ చేయడానికి ఉన్న సమయం సరిపోదని, సాంకేతిక సమస్యలు ఉన్నాయని ఎన్నో విజ్ఞప్తులు వచ్చినా, కేంద్రం గడువును పొడిగించకుండా మొండి వైఖరిని ప్రదర్శించింది. పోర్టల్‌లో రిజిస్టర్ అయి, ధ్రువీకరించిన ఆస్తులను మాత్రమే వక్ఫ్‌గా గుర్తిస్తామని కేంద్రం గతంలో ప్రకటించిన నేపథ్యంలో, మిగిలిన 75% ఆస్తుల భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకమైంది.

### న్యాయ పోరాటానికి ముస్లిం వర్గాలు:

పోర్టల్ హఠాత్తుగా మూసివేయడం, డిజిటలైజేషన్ ప్రక్రియను అసంపూర్తిగా వదిలేయడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్య వైఖరిని సూచిస్తోందని AIMPLB వంటి సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి. అసంపూర్తిగా ఉన్న ఆస్తుల ధ్రువీకరణ ప్రక్రియ ఇప్పుడు వక్ఫ్ ట్రిబ్యునల్‌పై ఆధారపడాల్సి వస్తుంది, ఇది చట్టపరమైన చిక్కులను, వక్ఫ్ ఆస్తుల రక్షణకు ముప్పును పెంచుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమస్య పరిష్కారం కాకుంటే కోర్టును ఆశ్రయిస్తామని ముస్లిం నాయకత్వం ప్రకటించడంతో, కేంద్రం తక్షణమే ఈ అంశాన్ని పునఃపరిశీలించి, పోర్టల్ గడువును పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వక్ఫ్ ఆస్తుల భద్రత, డిజిటలైజేషన్ అనే కీలకమైన లక్ష్యం కేవలం ఒక గడువు పెంపు ప్రకటనతో నెరవేరే అవకాశం ఉంది.



# ఉరితాడును ముద్దాడిన అమర మిత్రులు

## (డిసెంబర్ 19 అష్ఫాఖ్ , బిస్మిల్ లను ఉరి తీసినరోజు..)

**- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

**భారత దేశ** స్వాతంత్ర్యం కోసం అనేక మంది యువ కిశోరాలు తమ ప్రాణాలను పణంగా పెట్టారు. వారిలో రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్‌లు ముఖ్యులు. వయసుకు మించిన పరిణితితో కేవలం ముప్ఫయ్యేళ్ళకే నూరేళ్ళ ఖ్యాతినార్జించి, దేశం కోసం ఉరితాడును ముద్దాడిన దేశ భక్తులు. ఆంగ్లేయులకు సింహస్వప్నాలై ముచ్చెమటలు పట్టించిన రాంప్రసాద్, బిస్మిల్‌లలో.. బిస్మిల్ 1897 జూన్ 11వ తేదీన, అష్ఫాఖ్ 1900 అక్టోబర్ 22న ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లో జన్మించారు. మూల్ మతి, మురళీధర్‌లు బిస్మిల్ తల్లిదండ్రులు. మజ్హరున్నీసా, షఫీఖుల్లాహ్ ఖాన్ అష్ఫాఖ్ తల్లిదండ్రులు. రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖ్‌ల కుటుంబ నేపథ్యాలు ఉత్తర దక్షిణ ధృవాల్లాంటివి. రాంప్రసాద్ బిస్మిల్ సనాతన హిందువు, ఆర్యసమాజ సభ్యుడు. అష్ఫాఖ్ సాంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిన స్వచ్ఛమైన ముస్లిం. భిన్న సామాజిక జీవన నేపథ్యాలనుండి వచ్చిన వీరి స్నేహం పాలూ పంచదారలా కలగలిసి పోయింది.

అష్ఫాఖ్ ముస్లిం కావడంతో ఆర్య సమాజ సభ్యుడైన బిస్మిల్ మొదట్లో అతన్ని ఒక పట్టాన నమ్మలేదు, శంకించాడు. కాని అచంచలమైన అష్ఫాఖ్ దేశ భక్తికి, అంకిత భావానికి బిస్మిల్ చలించి పోయాడు. అష్ఫాఖ్‌ను అనుమానించినందుకు తీవ్రంగా పశ్చాత్తాప పడ్డాడు. చివరికి ఇద్దరి లక్ష్యం ఒకటే కావడంతో సనాతన హిందువైన రాంప్రసాద్ బిస్మిల్‌కు, సాంప్రదాయ ముస్లిం ఐన అష్ఫాఖ్‌కు గాఢమైన స్నేహబంధం ఏర్పడింది. ఒకే కంచంలో తినేవారు. ఒకే మంచంపై పడుకునే వారు. ఒకరికొకరు ప్రాణ సమానమై పొయ్యారు. ఎవరి ధర్మాలను వారు పాటిస్తూనే దేశం కోసం ఒక్కటై భావి తరాలకు ఆదర్శంగా నిలిచి పొయ్యారు. ఇద్దరు యువకులూ భావుకులే. యుక్త వయసులోనే పదునైన కవిత్వం రాశారు. సామ్రాజ్యవాద భావజాలాన్ని తుత్తునియలు చేశారు. అచంచలమైన దేశభక్తితో బ్రిటీషోడి గుండెల్లో నిప్పు కణికలై రగిలారు. పర్వతంలా పాతుకు పోయిన ఆంగ్లాధికారాన్ని తొడగొట్టి ఢీకొట్టారు. ఆర్థిక ఇబ్బందులు లేని కుటుంబాల్లో, చీకూ చింతా లేకుండా విలాసవంతంగా గడప వలసిన యవ్వన కాలంలో దేశం గురించి ఆలోచించడం మామూలు విషయం కాదు. కాని వారు ఆ వయసులోనే దేశం కోసం ఆలోచించారు. రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేని కుటుంబ నేపథ్యాలైనా, వారి ఆలోచనలు రాజకీయంగానే

సాగేవి. దీంతో ఎప్పుడెప్పుడు విప్లవోద్యమంలోకి దూకాలా అని ఉవ్విళ్ళూరే వారు. విదేశీ వస్తువుల వాడకం ఆంగ్లేయుల బానిసత్వానికి చిహ్నమని, వీటి వాడకం మానేయాలని ప్రచారమే ప్రారంభించారు. మాతృదేశం కోసం పోరాడి చరిత్రలో నిలిచి పోవాలని, దానికోసం తాము ఏమైపోయినా పరవాలేదని దృఢంగా నిర్ణయించుకున్నారు. ఇక ఉద్యమ అవసరాలకోసం కావలసిన ధనాన్ని ప్రభుత్వ ధనం కొల్లగొట్టడం ద్వారా సమకూర్చుకోవాలని నిర్ణయించారు. అందులో భాగంగా 1925 ఆగష్టు 9వ తేదిన అష్ఫాఖుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్, చంద్రశేఖర్ ఆజాద్ లాంటి మరికొందరు విప్లవకారులు కలిసి కాకోరీ గ్రామం వద్ద ప్రభుత్వ ఖజానాతో వెళుతున్న రైలును దోపిడీ చేశారు. పట్టుమని పదిమంది కూడా లేని యువకులు ఏకంగా బ్రిటిష్ ఖజానాకే గురి పెట్టి, రైలునే దోచేయడం ఆంగ్లాధికారులకు తల తీసేసినంత పనైతే, ఉద్యమ కారులకు కొత్త ఉత్సాహాన్ని అందించి నట్లయింది. దీంతో ఆంగ్లాధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని సోదాలు ముమ్మరం చేసి, సెప్టెంబరు 26న రాంప్రసాద్ బిస్మిల్‌ను అరెస్టు చేశారు. అష్ఫాఖ్ ఇంటిపై కూడా పోలీసులు దాడిచేశారు. కాని అష్ఫాఖ్ వారికి దొరక్కుండా తప్పించుకున్నాడు. కొన్నాళ్ళపాటు బనారస్‌లో అజ్ఞాతంలో గడిపి ఢిల్లీ చేరుకున్నాడు. ఢిల్లీలో మిత్రుడు చేసిన నమ్మక ద్రోహంతో పోలీసులకు పట్టుబడ్డాడు. నయానా భయానా లొంగదీసుకొని మిగతా వారి సమాచారం రాబట్టాలని పోలీసులు ఎంత ప్రయత్నించినా అష్ఫాఖ్ ఏమాత్రం భయపడ లేదు. చివరికి 1927 డిసెంబర్ 19వ తేదీన అష్ఫాఖ్‌ను, రాంప్రసాద్ బిస్మిల్‌ను ఉరి తీయాలని తీర్పు వెలువడింది. ప్రాణత్యాగానికి ఏనాడో సిద్ధపడ్డ ఈ ఇద్దరు ప్రాణ మిత్రులు మాతృదేశ విముక్తి కోసం ఉరి కంబాన్నెక్కబోతున్నందుకు గర్వపడుతున్నామని సగర్వంగా ప్రకటించారు. ఇంతటి అదృష్టం అందరికీ దక్కదని, ఏడుకోట్ల (ఆనాటి) ముస్లిం జనాభాలో దేశం కోసం బలిపీఠమెక్కబోతున్న ముస్లింగా సంతోషంతో పొంగిపోతున్నాని అష్ఫాఖ్ గర్వంగా ప్రకటించాడు. ఉరితాడును పూలమాలగా స్వీకరించి, 'నా మాతృదేశమా.. సదా నీసేవ చేస్తూనే ఉంటా.. ఉరి శిక్షయినా, యావజ్జీవమైనా.. సంకెళ్ళ దరువుతో నీ కీర్తిగానం చేస్తూనే ఉంటా.' అని కవితాత్మకంగా తన దేశభక్తిని చాటుకున్నాడు. ' కుఛ్ ఆర్జూ నహీ.., హయ్ తొ బస ఇత్ ని.., రఖ్ దె కోయీ ఖాకె వతన్ మేరె కఫన్ మే..' అంటూ దేశం పట్ల, తను పుట్టిన భూమి పట్ల తన అచంచలమైన ప్రేమాభిమానాలను వ్యక్తం చేశాడు. ఆ రోజు రానే వచ్చింది. ప్రాతఃకాల ప్రకృతి ఈ తంతంగాన్నంతా చేష్టలుడిగి చూస్తూ ఉండి పోయింది. అమరజీవులు అష్ఫాఖుల్లా, రాంప్రసాద్ బిస్మిల్‌ల ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పొయ్యాయి. ఇద్దరినీ వేర్వేరు జైళ్ళలో ఒకేరోజు, ఒకే సమయాన ఉరి తీశారు. భూ ప్రపంచం ఉన్నంత వరకు దేశం పట్ల బాధ్యతను గుర్తుచేస్తూ అష్ఫాఖ్, బిస్మిల్‌ల త్యాగం, స్నేహం సజీవంగా ఉంటుంది. హిందూ ముస్లిం ఐక్యతను చాటుతూ.. మతోన్మాదులకు సవాలు విసురుతూ సామరస్య గీతం ఆలాపిస్తూనే ఉంటుంది.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com




ఈ లోకంలో ఎవరినైనా బహిరంగంగా తప్పు బట్టడం అంటే, వారిని సరిదిద్దడం కాదు, వారిని అవమా నించడమే. ఇది నిప్పులో వేసిన నెయ్యిలాంటిది. మనిషి స్వభావం ఎలాంటిదంటే, తన తప్పును ఏకాంతంలో ఒప్పుకుంటాడే తప్ప, పదిమందిలో తల దించుకోవడానికి ససేమిరా ఒప్పుకోడు. కానీ, ఈ కాలంలో చాలా మంది సోషల్ మీడియా వేదికలపైనో, వాట్సాప్ గ్రూపుల్లోనో ఇతరుల తప్పులను ఎత్తి చూపుతున్నారు. ఫలితం? సలహా సున్నా, శత్రుత్వం వంద శాతం.

## సత్సంకల్పమే కీలకం : హృదయ శుద్ధితోనే ఉపదేశం!

మనం ఏ పని చేసినా, దాని వెనుక ఉన్న సత్సంకల్పం ముఖ్యం అంటారు పెద్దలు. అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చినట్లు: "కర్మలు సంకల్పంపై ఆధారపడి ఉంటాయి." ఒకరి తప్పును సరిదిద్దే ముందు, మన మనసు స్వచ్ఛంగా ఉండాలి. 'వారిని చిన్నబుచ్చాలి', 'నేను గొప్పవాడినని చూపించు కోవాలి' అనే దురహంకారం ఉంటే, ఆ సంస్కరణ కత్తి అదుపు తప్పిపోతుంది.

పల్లెటూరిలో ఒక సామెత ఉంది: "పక్కవారి కష్టానికి పండగ చేసుకుంటే, రేపు ఆ కష్టం మనకే రావచ్చు." ఇతరుల కష్టాన్ని చూసి సంతోషించేవారిని అల్లాహ్ పరీక్షలో పడేయగలడు. అలాగే, ఆత్మస్తుతి కోసం చేసే సంస్కరణ ఎప్పటికీ ఫలితాన్నివ్వదు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి పద్ధతిని గమనిస్తే, ఆయన ఎప్పుడూ ఎవరి పేరు చెప్పకుండా, "కొందరికి ఏమైంది, ఇలా చేస్తున్నారు?" అని మాత్రమే అనేవారు. అంటే, విమర్శ వ్యక్తిని లక్ష్యంగా చేసుకోకూడదు, కేవలం ఆ తప్పును మాత్రమే లక్ష్యంగా చేసుకోవాలి. ఇది గోడకు వేసిన సున్నంలా గట్టిగా మననం చేసుకోవాల్సిన విషయం.

## సరిదిద్దే ఆధారం : ధర్మం గీసిన గీతే ప్రమాణం!

ఎవరైనా తప్పు చేశారని చెప్పడానికి మనకు ఒక కొలబద్ద ఉండాలి. ఆ కొలబద్ద ఏకపక్షంగా, మన ఇష్టం వచ్చినట్టు ఉంటే ఎలా? 'నా ఇష్టం నాదే' అన్నట్టు వ్యవహరించకూడదు. ధర్మం (షరీయత్) యొక్క సరైన మూలాలు ఖురాన్, ప్రామాణిక హదీసులు, పండితుల ఏకాభిప్రాయం- కాకుండా, మన సొంత ఊహలు, ఆచారాలు ప్రమాణాలు కాకూడదు.

శిక్షణ (తర్బియా) విషయంలోనూ ఇదే సూత్రం. తల్లిదండ్రులు అనుసరించే పద్ధతి కావచ్చు, సామాజిక ఆచారాలు కావచ్చు - ఏవైనా సరే, అవి దీన్ (ధర్మం) అనే అగ్నిపరీక్షలో నెగ్గితేనే ఆమోదించాలి. ఇస్లాం సమతుల్యత (ఉమ్మతె వసత్)ను బోధిస్తుంది. అతిగా దేనినీ పెంచకూడదు, తగ్గించకూడదు. ఉదాహరణకు, తెగ లేదా కుటుంబ అభిమానం (అసబియత్) పేరిట ముస్లింల మధ్య ఐక్యతను పలచబరిచే ఏ ఆచారమైనా జాహిలియత్ (అజ్ఞాన కాలం) నాటిదే. ముస్లింల మధ్య బంధం విశ్వాసంపై మాత్రమే ఆధారపడి ఉండాలి.

## మృదుత్వమే మాట మంత్రం: వేగమెందుకు?

తప్పు చేసిన వ్యక్తిని చూసిన వెంటనే గుండెల్లో రైళ్లు పరిగెత్తినట్లు ఆవేశపడకూడదు. పదిమందిలో కఠినంగా మాట్లాడటం వల్ల మనిషి మొండిగా మారుతాడే తప్ప, మంచిగా మారడు. మస్జిదులో మూత్రం పోసిన వ్యక్తి విషయంలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎంత సావధానంగా వ్యవహరించారో గుర్తుంచు కోవాలి. ఆయన, "మీరు సులభం చేసేవారుగా పంపబడ్డారు, కష్టం చేసేవారుగా కాదు" అని సెలవిచ్చారు. మృదుత్వం అనేది మనిషికి అల్లాహ్ ఇచ్చిన ఒక గొప్ప ఆశీర్వాదం. ఎవరికి మృదుత్వం లభించిందో, వారికి శ్రేయస్సు లభించినట్లే.

సంస్కరణ విషయంలో తొందరపాటు అనేది 'ఈగను చంపడా నికి బండరాయి విసిరి, యజమానినే చంపిన ఎలుగుబంటి' కథను గుర్తు చేస్తుంది. చిన్న తప్పును సరిదిద్దడానికి ఉద్వేగంతో ఆవేశపడటం వల్ల, అది మహా ప్రమాదానికి దారి తీయవచ్చు. నిజమైన మల్లయోధుడు శారీరక శక్తితో పడగొట్టేవాడు కాదు, కోపం వచ్చినప్పుడు తనపై నియంత్రణ ఉంచుకునేవాడు.

అలాగే, మార్పు ఒక్క రాత్రిలో జరగదు. సంవత్సరాలుగా అబ్బిన అలవాట్లు ఒక్క సలహాతో మారిపోతాయని ఆశించడం బ్రహ్మ పదార్థం గురించి మాట్లాడినట్టే. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకరినొకరు మార్చాలనుకున్నప్పుడు సమయపాలన, సహనం పాటించడం అత్యవసరం. సంస్కరణ అనేది ఒక పంట వేసినట్టే-నేడు విత్తనం వేస్తే, రేపే పంట రాదు. ఓపిక పట్టాలి.

## వయస్సు విలువ: గౌరవంతో కూడిన సంస్కరణ

సంస్కరణ చేసేటప్పుడు మనం తరచుగా మర్చిపోయే విషయం-వయస్సు పరిగణన. చిన్న పిల్లలతో ప్రేమ, దయతో మాట్లాడాలి. వారిని గద్దించి ఆజ్ఞాపిస్తే మొండిగా మారతారు. యుక్త వయస్కులు తమను పెద్దవారిలా భావించాలని కోరుకుంటారు. ఆ వయస్సులో వారిని చిన్నపిల్లల్లా చూస్తే, వారిలో తిరుగుబాటు భావన పెరుగుతుంది.

అదేవిధంగా, వృద్ధులతో మాట్లాడేటప్పుడు మన సంస్కరణలో గౌరవం, ఆప్యాయత వెల్లివిరియాలి. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి స్సలాం) తన తండ్రికి ఏక దైవారాధన గురించి సలహా ఇచ్చిన ప్పుడు, "ఓ నా తండ్రీ (యా అబతి)" అని ఆప్యాయంగా పిలిచారు. పదిమందిలో పెద్దవారిని అవమానించి, వారి నోటి తోనే వారికి చెప్పడం వల్ల ప్రయోజనం ఉండదు, శత్రుత్వమే మిగులుతుంది.

## ముగింపు మంత్రం: కారణమే చికిత్స!

ఒక తప్పుకు కారణం ఏమిటో తెలుసుకోకుండా, పైపైన చికిత్స చేస్తే, అది తాత్కాలిక ఉపశమనం మాత్రమే ఇస్తుంది. దొంగతనం చేసిన పిల్లవాడిని శిక్షించడం కంటే, అతడు దొంగతనం చేయడా నికి గల అసలు కారణం - జేబు ఖర్చు లేకపోవడం కావచ్చు లేదా ఇతరుల హక్కుల గురించి తెలియకపోవడం కావచ్చు-దానిని సరిదిద్దాలి. రోగం ఎక్కడుందో తెలుసుకుంటేనే, సరైన వైద్యం చేయగలం.

ఒక ముస్లింగా మనం గుర్తుంచుకోవాల్సిన విషయం: నిజాయితీ గల సంకల్పం, మృదువైన మాట, సరైన ఆధారం, సమతుల్య వైఖరి- ఈ నాలుగు సూత్రాలు పాటిస్తేనే సంస్కరణ సార్థకమవు తుంది. లేకపోతే, చేసేదంతా మేలే అని భ్రమ పడి, కీడు చేసే ప్రమాదం ఉంది. సలహా ఇచ్చే ప్రతి ఒక్కరూ ఈ సలహా సంస్కారం పాటిస్తే, సమాజం సుఖశాంతులతో వర్ధిల్లుతుంది.

**చందాదారులకు విజ్ఞప్తి**

**చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.**

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

# ఐదు నైతిక విలువలు మనిషి జీవన మార్గదర్శకాలు

- నసీరా బేగం

**ప్రతి** మనిషికి నైతిక విలువల ప్రాముఖ్యత స్వభావరీత్యా తెలిసినప్పటికీ, కొన్ని సందర్భాలలో కొన్ని కారణాల వల్ల వాటిని విస్మరిస్తూ ఉంటాడు. ఈ విస్మరణ వల్ల అతని ఇహలోక జీవితం దెబ్బతినడమే కాకుండా, పరలోక జీవితమూ నష్టానికి గురవుతుంది. అంతేకాక, మానవ సంబంధాలు తీవ్రంగా దెబ్బతింటాయి.

దీని తీవ్రతను దైవప్రవక్త (స) ఒక ఉపమానం ద్వారా స్పష్టం చేశారు: “పరస్పర సంబంధాలు దెబ్బతినడం అనేది శిరోముండనం చేసే కత్తి లాంటిది. అది జుట్టును కాదు, ధర్మాన్నే ముండనం చేస్తుంది (పూర్తిగా నాశనం చేస్తుంది).”

## నైతిక విలువలు లేకపోతే ఏం జరుగుతుంది?

ఒకసారి దైవప్రవక్త (స) తమ అనుచరులను ఉద్దేశించి “పేదవాడు అంటే ఎవరో మీకు తెలుసా?” అని అడిగారు. వారు “ఓ దైవప్రవక్తా(స)! ధనం లేనివాడినే మేము పేదవాడిగా భావిస్తాము” అని సమాధానమిచ్చారు. ఆయన (స) ఇలా వివరించారు: “కాదు, నా సమాజంలోని నిజమైన పేదవాడు ఎవడంటే... ప్రళయదినం నాడు నమాజ్‌లు, ఉపవాసాలు, దానధర్మాలు వంటి లెక్కలేనన్ని సత్కార్యాలను కూడబెట్టుకుని వస్తాడు. కానీ, అతను ఈ లోకంలో ప్రజలలోని ఎవరి హక్కులనైనా కొల్లగొట్టి ఉంటాడు, ఎవరిపైనైనా నిందవేసి ఉంటాడు, ఎవరినైనా తిట్టి ఉంటాడు, కొట్టి ఉంటాడు, లేదా చంపి ఉంటాడు.

అక్కడ డబ్బు, నాణాలు, రూపాయలు చెల్లవు. కేవలం అతను తీసుకెళ్లిన సత్కార్యాలు మాత్రమే చెల్లుతాయి. నష్టపోయిన దావాదారులకు ప్రతిఫలంగా ఆ సత్కార్యాలనే ఇవ్వవలసి ఉంటుంది. ఆ పాపాలకు ప్రాయశ్చిత్తంగా సత్కార్యాలు ఇస్తూ ఇస్తూ అవి పూర్తిగా అయిపోతే, అప్పుడు ఆ దావాదారుల పాపాలే ఇతని ఖాతాలో జమ చేయడం జరుగుతుంది. చివరకు, అతను నరకంలోకి పడవేయబడతాడు. ఈ విధంగా, నైతిక విలువలు లేకపోవడం వల్ల అతను కూడబెట్టుకున్న సత్కార్యాల సంపదంతా నాశనమైపోతుంది.”

## ప్రళయదినం నాడు, మనిషి సత్కార్యాలు మూడు విభాగాలుగా ఉంటాయి

**1. అల్లాహ్ ఏనాడూ క్షమించనిది :** అల్లాహ్‌కు భాగస్వామ్యాన్ని ఆపాదించడం (షిర్క్).

**2. అల్లాహ్ క్షమించగలిగే భాగం :** ఆరాధన (ఇబాదత్)లోని లోపాలు. అల్లాహ్ కోరితే శిక్షించవచ్చు, లేదా క్షమించవచ్చు.

**3. అల్లాహ్ లెక్క తీసుకోకుండా ఉండలేని భాగం :** మనిషికి మనిషికి మధ్య జరిగిన పాపాలు. కారుణ్య ప్రభువైన అల్లాహ్ సైతం తోటి సోదరుని ధనమాన ప్రాణాలను నిషేధించాడు.

అనైతికతకు సంబంధించిన విషయాలు అనేకమున్నప్పటికీ, వాటిలో ఐదు ప్రధానమైనవిగా కనిపిస్తాయి. మనం ఈ ఐదింటి నుండి మనల్ని మనం కాపాడుకోగలిగితే, మిగిలిన చెడు విషయాలు వాటంతట అవే దూరమైపోతాయి.

## 1. గర్వం (అహంకారం): సకల చెడులకు మూలం

గర్వం అంటే తమను తాము గొప్పగా భావించడం. చాలామంది ఇది కేవలం ధనవంతులకు లేదా అధికారులకు మాత్రమే సోకే వ్యాధిగా భ్రమపడతారు. కానీ ఇది ఒక సహజమైన మానసిక వ్యాధి. ధనవంతుడు, పేదవాడు, జ్ఞాని, అజ్ఞాని, అందగాడు, నిరక్షరాస్యుడు... ఎవరైనా దీనికి గురి కావచ్చు. గర్వాన్ని చెడులన్నింటికీ మూలం అని చెప్పవచ్చు. దీనికి అత్యంత ఘోరమైన ఉదాహరణ షైతాన్ (ఇబ్లీస్). అతడు గర్వం కారణంగానే ఆదమ్ (అ)కు ఒక్క సజ్దా (సాష్టాంగం) చేయడాన్ని తిరస్కరించాడు.

అంతేకాక, తాను పడిన అపమార్గంలోకి మనుషులను కూడా గురి చేస్తానని శపథం చేశాడు.

ప్రజలు దైవప్రవక్త (స)ను ఇలా అడిగారు: "ఓ దైవప్రవక్తా (స)! ఒక మనిషి మంచి బట్టలు, మంచి చెప్పులు ధరించాలని అనుకోవటం కూడా గర్వమేనా?"

ఆయన (స) గంభీరంగా ఇలా సమాధానమిచ్చారు: "ఇది గర్వం కాదు. గర్వం ఏమిటంటే, మనిషి సత్యాన్ని తిరస్కరించడం, ప్రజలతో అసహ్యంగా ప్రవర్తించడం, వారిని హీనపరచడం, తనకంటే అల్పులుగా భావించడం."

దైవప్రవక్త (స) కంటే గొప్ప వ్యక్తి మరొకరు లేరు. ఆయన (స) తన పనులన్నీ స్వయంగా చేసుకునేవారు, ఇంట్లో భార్యలకు సహాయం చేసేవారు, నిత్యం చిరునవ్వుతో ఉండేవారు. స్త్రీలు, పిల్లలకు సైతం ముందుగా సలామ్ చేసేవారు. సభలో అందరితో కలిసి క్రిందనే కూర్చునేవారు, అందరితో కలిసి భోజనం చేసేవారు. దీని ద్వారా తెలిసిన విషయమేమిటంటే, రవ్వంత గర్వం కూడా లేని వ్యక్తి మాత్రమే ఇలా వ్యవహరించగలరు.

## 2.అసూయ (ఈర్ష్య): సత్కార్యాలను దహించే అగ్ని

అసూయ అంటే తన వద్ద లేని మంచి వస్తువు, హోదా లేదా సుగుణం ఇతరుల వద్ద ఉన్నప్పుడు, అది తనకు లేకపోయినా పర్వాలేదు కానీ, వారి వద్ద కూడా ఉండకూడదని కోరుకోవడం. ఇది ఒక భయంకరమైన వ్యాధి.

"అసూయ సత్కార్యాలను దహించివేస్తుంది. ఏ విధంగానైతే అగ్ని కట్టెపుల్లల్ని కాల్చివేస్తుందో."

ఎవరి పట్ల అయినా మనిషికి అసూయ కలిగినట్లయితే, అతను ఆ మనిషికి ఏదో ఒక విధంగా నష్టాన్ని చేకూర్చడానికి పూనుకుంటాడు. అతని గౌరవాన్ని అభాసుపాలు చేయాలని చూస్తాడు. సభల్లో అతన్ని ఎగతాళి చేస్తాడు, అతని గురించి చెడుగా ప్రదర్శిస్తాడు, లేని అభాండాలు మోపుతాడు. ఎవరైనా అతని గురించి మంచిగా చెప్పినట్లయితే, అతని చెడును తెలుసుకోవడానికి, కూపీలు లాగడానికి ప్రయత్నిస్తాడు. ఈ విధంగా, అసూయ ఎన్నో చెడు పనులు చేయడానికి పురికొల్పుతుంది. ఈ అసూయా ద్వేషాల కారణంగానే జ్ఞానవంతుడుగా ఉన్న షైతాన్ ఆదమ్ (అ)కు సజ్దా చేయలేదు, చివరకు దైవధిక్కారానికి గురయ్యాడు.

## 3. కోపం (క్రోధం) : తన కోపమే తనకు శత్రువు

"తన కోపమే తనకు శత్రువు" –ఈ సామెత అనాదిగా చెప్తున్న సత్యం. కోపం ద్వారా ఎన్నో దుష్కార్యాలు ఉనికిలోకి వస్తాయి, అవి మనసుపైనా, శరీరంపైనా తీవ్ర ప్రభావాన్ని చూపి, పెద్ద పెద్ద వ్యాధులకు దారితీస్తాయి.

కోపం రావడం సహజమైన విషయమే. కొన్నిసార్లు సక్రమంగా జరగని పనులను సరిదిద్దడానికి కోపం అవసరం కూడా. కానీ, చిన్నచిన్న విషయాలకే పదేపదే కోపం రావడం, ఆ కోపాన్ని ఇతరుల ముందు ప్రదర్శించి వారికి నష్టాన్ని చేకూర్చడం అత్యంత చెడ్డ విషయం. ఎందుకంటే, కోపంలో ఉన్నప్పుడు మనిషి మంచీ చెడుల విచక్షణను కోల్పోతాడు. తాను చెప్పిందే సరైనదని భావిస్తాడు, ఇతరులు దాన్ని పాటించకపోతే వారిపై చేయి చేసుకుంటాడు, చివరకు హత్యలు కూడా చేస్తాడు.

కనుకనే, కోపాన్ని దిగమ్రింగాలని, ఇతరులను క్షమించివేయాలని అల్లాహ్ గ్రంథంలో తెలియజేశాడు. అలాంటివారు అల్లాహ్‌కు ఎంతో ప్రియులు.

## 4. అనుమానం : పెనుభూతం

"అనుమానం పెనుభూతం" అని ఎప్పటి నుంచో చెబుతుంటారు. అనుమానం అనే చిన్న నిప్పురవ్వ రాజుకోవడం మొదలైతే, అది చివరకు పెద్ద మంటలా మారి, జరగరాని అనర్థాలకు దారితీస్తుంది.

కనుకనే, ఖుర్‌ఆన్‌లో "ఎక్కువగా అనుమానాలకు గురికాకూడదు, కొన్ని అనుమానాలు పెద్ద పెద్ద పాపాలుగా రూపొందుతాయి" అని సెలవీయడం జరిగింది.

అనుమానానికి కాళ్ళు చేతులు ఉండవు. అది మనిషి నోటితో వెలువడే ఒక పదం. ఎవరైనా అనుమానాన్ని వ్యక్తం చేస్తే, దానికి సాక్ష్యాలు కావలసి ఉంటుంది. సాక్ష్యాధారాలు లేకుండా మనిషి ఇట్టే అనుమానాన్ని వ్యక్తం చేస్తే ఇస్లామ్ ధర్మం దానిని అంగీకరించదు.

అనేకమంది ఎదుటి వ్యక్తి సంకల్పం (నియ్యత్) పట్ల అనుమానాన్ని వ్యక్తం చేస్తారు. "అతని సంకల్పంలో చిత్తశుద్ధి లేదు, అందుకే నా పట్ల ఇలా చేశాడు" అని చెప్పుకుంటూ ఉంటారు. ఇది కూడా అనుమానమే. ఎందుకంటే, ఒకరి సంకల్పాన్ని అల్లాహ్ తప్ప ఎవరూ ఎరుగలేరు. అనుమానం ఎన్నో చెడులను, పాపాలను జన్మనిస్తుంది. కనుక, అనుమానానికి చాలా దూరంగా ఉండటమే మనిషికి శ్రేయస్కరం.

## 5. చాడీలు చెప్పడం (గీబత్) : మృత సోదరుని మాంసం

చాడీలు చెప్పడం అంటే ఎదుటివాడు అక్కడ లేనప్పుడు అతని గురించి ఇతరులకు చెడుగా చెప్పడం. దీని ద్వారా అతని పరువు తీయడానికి కృషి చేస్తారు, ఇతరుల ముందు అతనికి విలువ లేకుండా చేయాలని చూస్తారు. అంతేకాక, అక్కడ తన విలువ పెరగాలని, తను మంచి వ్యక్తిగా వారు భావించాలని కోరుకుంటారు.

ఇదంతా అతని వీపు వెనుక చేస్తాడు, అతనికి వెన్నుపోటు పొడుస్తూ ఉంటాడు. మళ్ళీ అతను వారి మధ్య వచ్చినప్పుడు అతని గురించి మంచిగా మాట్లాడతాడు. దీని ద్వారా నష్టపోయేది ప్రధానంగా చాడీలు చెప్పే వ్యక్తియే.

కనుకనే, ప్రవక్త(స) చాడీలు చెప్పటాన్ని తన మృత సోదరుని మాంసం తిన్నట్లు అని అత్యంత జుగుప్సాకరంగా తేల్చి చెప్పారు. చాడీలు చెప్పేటప్పుడు, తన ముందు మృత కళేబరం ఉన్నట్లు, అందులోనుంచి మృత మాంసాన్ని తాను తింటున్నట్లు భావించినట్లయితేనే మనిషి చాడీలు చెప్పడం నుంచి తనను తాను నియంత్రించుకోగలుగుతాడు.




# పెళ్లి పేరిట వృథా ఆపండి!

**- షబానా**

**నిరుద్యోగం, ధరల పెరుగుదల...** ఈ రెండూ మన సాధారణ జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. అల్పమైన ఆదాయంతో బ్రతుకు బండిని లాగడం ఎంత కష్టమో, ప్రతి ఇంటి గోడకూ తెలుసు.

మరీ ముఖ్యంగా, మన ముస్లిం సమాజంపై ఇది దైవ పరీక్షలాంటి సవాలు. ఆర్థికంగా మనల్ని వెనుకబడేలా చేయాలనే కుట్రలు జరుగుతున్న ఈ తరుణంలో, మన సంపదకు నిజమైన రక్షణ కవచం వేయాల్సిన అవసరం ఉంది. ప్రదర్శన కోసం వృథా చేయడం ఒక మనిషికి తగదు. కానీ, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో విలాసపు వివాహాలు ఒక సామాజిక శాపంగా మారడం ఎంత మాత్రం సమర్థనీయం కాదు! ఈ దుబారా ధోరణి జాతి వివేక లోపాన్ని పట్టి చూపుతోంది. మన సంపదను పవిత్రంగా పరిరక్షించుకునే బాధ్యతను మనం గాలికి వదిలేస్తున్నామా?

## విచ్ఛిన్నమవుతున్న కుటుంబ కోట

ఆర్థిక కష్టాల కంటే భయంకరమైనది సామాజిక పతనం. ప్రపంచం నేడు కుటుంబ బంధాన్ని కన్నీటితో తుడిచి వేయాలని చూస్తోంది. లివ్-ఇన్ అనే విష సంస్కృతి యువత మనసుల్లోకి చొచ్చుకు పోతోంది. ఇలాంటి యుగంలో, మన నికాహ్ బంధాన్ని పటిష్టం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది.

కానీ మనం ఏం చేస్తున్నాం? పెళ్లిని సులభతరం చేయాల్సింది పోయి, భయంకరమైన భారంగా మారుస్తున్నాం! గంటల సంబరం కోసం, ప్రజల ముందు ప్రతిష్టను ప్రదర్శించడం కోసం, యువతరం జీవితాలను ఆలస్యం అనే బలిపీఠంపై బలిస్తున్నాం. వివాహం చేయాలంటే కొండంత అప్పు చేయాల్సిందేనా? ఈ ఆర్భాటం మన యువతకు నిశ్చింతను దూరం చేసి, మానసిక ఆందోళనను పెంచుతోంది. మన ఆడపిల్లల తల్లిదండ్రుల కళ్ళలోని నిద్రను దోచుకుంటున్న ఈ దురాచారాన్ని ఇంకెంత కాలం సహిద్దాం?

## వృథా ఖర్చు- షైతాన్ మార్గం!

మన సంపాదనే మన భవిష్యత్తుకు పెట్టుబడి. పొదుపు చేస్తే- రేపటి తరానికి ఇల్లు, ఆధ్యాత్మికంగా హజ్ పుణ్యం, పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు లభిస్తాయి. కానీ, మన జీవితకాలపు కష్టాన్ని కేవలం కొన్ని గంటల డప్పుల మోత కోసం, మెరిసే అలంకరణల కోసం, మిగిలి పారేసే విందుల కోసం వెచ్చించడం ఎంతటి ఘోరం?

మన పవిత్ర గ్రంథం ఖురాన్ ఎంత కఠినంగా హెచ్చరించిందో

**గుర్తుంచుకోండి** : వృథా చేసేవారు షైతాన్ సోదరులు అని ప్రకటించింది. ఒక పవిత్రమైన బంధాన్ని ప్రారంభించే వేదికను, మనం షైతాన్ సోదరత్వానికి నిదర్శనంగా మారుస్తున్నామా? ఈ భారీ ఖర్చులు- మితిమీరిన విందులు, ప్రదర్శన, మిశ్రమ సమావేశాలు- అనేక పాపాలకు పునాది రాయి వేస్తున్నాయి. ఇది కేవలం డబ్బు వృథా కాదు, ఇది నైతిక పతనం!

## సంకల్పంతో సమాజంలో మార్పు

సమాజంలో సామాజిక ఒత్తిడి అనే ఒక కఠినమైన సంకెళ్ళు వేయబడ్డాయి. ధనవంతులు తమ స్వార్థం కోసం పెట్టే దుబారా, పేదవారిపై పోటీ అనే అదనపు భారాన్ని మోపుతోంది. ఈ పోటీ ఫలితమే, ప్రతి ఇంట్లోనూ వివాహ ఖర్చులు ప్రమాద గీతను దాటి పోతున్నాయి. ఒకరినొకరు మించిపోవాలనే పోటీ మన సమాజపు పునాదులనే కదిలిస్తోంది.

ఈ సంకెళ్ళను ఛేదించాలంటే, మనం వ్యక్తిగత స్థాయిలో సంకల్పం తీసుకోవాలి. ముందుగా మన కుటుంబాలలో, మన బంధువులలో అవగాహన కలిగించాలి. వివాహమంటే బంధం ఏర్పడటం, బంధనం కాదని వివరించాలి.

గౌరవం అనేది ఖర్చులో లేదు, నిరాడంబరతలో ఉంది. గొప్పతనం అనేది వేదిక అలంకరణలో లేదు, ఆ తర్వాత జీవితంలోని సౌభాగ్యంలో ఉంది.

## సౌభాగ్యం మన లక్ష్యం కావాలి

మన ప్రియమైన ప్రవక్త (స) బోధించినట్లుగా, ఏ వివాహం అత్యంత సులభంగా ఉంటుందో, అదే అత్యుత్తమమైనది. నికాహ్ సులభతరం కావాలి, జీవితం ఆనందమయం కావాలి.

## మన దృష్టి కేంద్రం మారాలి!

- ఒక్కరోజు వేడుకపై కాకుండా, ఎప్పటికీ నిలిచే వైవాహిక జీవితంపై మన దృష్టి ఉండాలి.

- కృత్రిమ ప్రదర్శనపై కాకుండా, నిజమైన సంతోషంపై మన దృష్టి ఉండాలి.

- ప్రపంచపు ఆడంబరాలపై కాకుండా, పరలోకపు శాశ్వత సౌభాగ్యంపై మన దృష్టి ఉండాలి.

ఖురాన్ పదేపదే హెచ్చరిస్తోంది: "నీ ప్రభువు అనుగ్రహించిన హలాల్ ఉపాధియే ఉత్తమమైనది, చిరకాలం ఉండేది " (తాహా: 131).

సమయం మించిపోకముందే మేల్కొందాం. భారీ ఖర్చులను పక్కన పెట్టి, నిరాడంబర వివాహాల ద్వారా సౌభాగ్యపు జీవితాలకు బాటలు వేద్దాం. అప్పుడే మన జీవితాలు సరైన మార్గంలో పయనిస్తాయి, మన జాతి ఆర్థిక, సామాజిక పతనాల నుండి సురక్షితంగా ఉంటుంది.

నిర్ణయం మన చేతుల్లో ఉంది: విలాసపు పతనమా? లేక సౌభాగ్యపు మార్గమా?

## వుజూతో పెరిగే పుణ్యాల అంతస్తు



**నమాజ్** చేయడానికి సిద్ధమైనప్పుడు అంతరంగ ప్రశాంతతతో పాటు భౌతిక పరిశుభ్రత కూడా చాలా ముఖ్యం. ఇందుకోసం వుజూ చేయాలని దివ్య ఖురాన్‌లో అల్లాహ్ పేర్కొన్నాడు. 'విశ్వాసులారా మీరు నమాజ్ కోసం లేచినప్పుడు మీ అవయవాలను ప్రక్షాళన చేసుకోండి. మీరు అపరిశుద్ధంగా ఉంటే స్నానం చేసి పరిశుద్ధులు అవ్వండి. మిమ్మల్ని పరిశుద్ధుల్ని చేయాలన్నదే అల్లాహ్ అభిమతం' అని దివ్య ఖురాన్ పేర్కొంది. విశ్వాసులు తమ అవయవాల తేజస్సును మరింత పెంచుకోవాలంటే వాటిని మరింత ఎక్కువ శుభ్రం చేసుకోవాలని దైవప్రవక్త (సల్లం) సూచించారు. ఉత్తమ పద్ధతిలో వుజూ చేసేవారి శరీరం నుంచి పాపాలు తొలగిపోతాయని దైవ ప్రవక్త (సల్లం) ప్రవచించారు. కష్టం అనిపించినప్పటికీ వుజూ చేయాలని.. అది వారి పుణ్యాల అంతస్తును పెంచుతుందని ఆయన ప్రబోధించారు. పరిశుభ్రత సగం విశ్వాసానికి(ఈమాన్) సమానమని.. ఆ పరిశుభ్రతను వుజూ నేర్పుతోందని తెలిపారు. నమాజ్ కోసం పిలిచే అజాన్ విన్నప్పుడు దరూద్ పఠించిన వారికి దైవానుగ్రహం లభిస్తుంది. అజాన్ విన్నవారు దానికి జవాబుగా ముఅజ్జిన్ పలికే మాటల్నే ఉచ్చరించాలి. అజాన్, ఇమాఖత్‌ల మధ్య చేయబడే ప్రార్థనను అల్లాహ్ తప్పక ఆలకిస్తాడు




## ఈసారి డిజిటల్ విధానంలో జనగణన

దేశంలో జనాభా (Population) లెక్కల సేకరణ స్వరూపం ఈసారి పూర్తిగా మారిపోనుంది. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా పేపర్ వాడకుండా డిజిటల్ విధానంలో జనాభా వివరాలను సేకరించబోతున్నారు. ఈ విషయాన్ని ఇటీవలె లోక్‌సభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వెల్లడించారు. డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రెండు మొబైల్ యాప్‌లను, ఒక వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. రెండు యాప్‌లలో ఒకటి జనాభా లెక్కలు సేకరించే వారి కోసం కాగా.. మరొకటి పౌరుల కోసం తయారు చేశారు. గతంలో జనాభా వివరాలు సేకరించాలంటే ఒక వ్యక్తి నుంచి 30 చొప్పున ప్రశ్నలు అడిగాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ప్రశ్నలతో యాప్‌లను రూపొందించారు. జనగణకులు తమ యాప్‌లో పౌరుల వివరాలను ఎంట్రీ చేస్తారు. ఆసక్తి ఉన్న పౌరులు వారి కోసం సిద్ధం చేసిన యాప్ ద్వారా నేరుగా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. పౌరులు నమోదు చేసుకున్న వివరాలను జనగణకులు ఇంటికి వచ్చి పరిశీలిస్తారు. ఈ విధానం ద్వారా జనగణన కోసం ఎక్కువ సమయం వెచ్చించాల్సిన అవసరం తప్పుతుంది. మన దేశంలో సాధారణంగా ప్రతి 10 సంవత్సరాలకు ఓసారి జనాభా లెక్కలను సేకరిస్తారు. చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. కరోనా కారణంగా 2021లో జనగణన వాయిదా పడింది. ఈ క్రమంలో 2027లో జనగణనకు కేంద్రం సిద్ధమైంది.

## ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టు విచారణ

ఎన్నికల కమిషన్ (ఈసీ) చేపట్టిన 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరిపింది. ఈ ప్రక్రియ 140 కోట్ల మంది పౌరులపై తమ పౌరసత్వాన్ని నిరూపించుకునే భారం మోపుతోందని, పత్రాలు చూపలేని లక్షలాదిమంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదముందని పిటిషనర్లు వాదించారు. పౌరసత్వాన్ని పరిశీలించే అధికారం ఈసీకి లేదని, ఇది రాజ్యాంగబద్ధమేనా అని ప్రశ్నించారు. ఈ అంశంపై వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పిటిషన్లు దాఖలవడంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. రాజకీయ జోక్యాన్ని ఆందోళనగా పేర్కొంది. ప్రధాన అంశమైన చట్టబద్ధతపై త్వరలో విచారణ జరిపేందుకు వీలుగా అన్ని పిటిషన్లను రాష్ట్రాలవారీగా వేరు చేయాలని కోర్టు ఆదేశించింది. అలాగే, ఈ ప్రక్రియ నుంచి అసోంను మినహాయించడంపై ఈసీకి నోటీసులు జారీ చేసింది.

## జర్నలిస్టుల విడుదలకు చర్యలు తీసుకోవాలి

దేశవ్యాప్తంగా పలు జైళ్లలో మగ్గుతున్న జర్నలిస్టులను విడుదల చేసే విషయంపై దృష్టి సారించాలని కోరుతూ జర్నలిస్టుల రక్షణ కమిటీ (సీపీజే) ప్రధాని నరేంద్ర మోడీని కోరింది. ఈ మేరకు కమిటీ ఒక లేఖ రాసింది. జర్నలిస్టుల నిర్బంధాన్ని కొనసాగించడం, వారిని వేధింపులకు గురి చేయడం వల్ల ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, పేద దేశాల స్వరంగా భారతదేశానికి గల పేరు ప్రతిష్టలు తుడిచిపెట్టుకుపోతున్నాయని కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నిర్బంధంలో వున్న జర్నలిస్టులు స్వేచ్ఛను పొందేలా, వారి కుటుంబాలను కలుసుకునేలా చర్యలు తీసుకోవాలని కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. 2014 నుండి యుఎపిఎ కింద 15మంది జర్నలిస్టులపై విచారణ జరిగిందని గుర్తు చేసింది. జార్ఖండ్‌కు చెందిన రూపేష్ కుమార్ సింగ్ మూడేండ్లకు పైగా జైల్లో మగ్గుతున్నారని తెలిపింది. పైగా జైల్లో కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో వుండడం లేదని పేర్కొంది. ప్రభుత్వం స్పందించి వెంటనే వారి విడుదలకు చర్యలు తీసుకోవాలని కమిటీ కోరింది.

## బ్యాలెట్ పేపర్‌కు మళ్లుదాం

ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో జరిగిన చర్చలో, ప్రధాన విపక్షాలు ఈవీఎంల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసి, తిరిగి బ్యాలెట్ పేపర్ విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేయడం భారత ప్రజాస్వామ్యంలో విశ్వసనీయతపై పెరుగుతున్న అనుమానాలను ప్రతిబింబిస్తోంది. కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీతో పాటు పలువురు నేతలు, ఈవీఎంల ద్వారా మోసం జరుగుతోందని తాను చెప్పకపోయినా, వాటిని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని ఘంటాపథంగా చెబుతున్నారు. ఓటరు తన ఓటు ఎటు పోతుందో స్పష్టత లేక, ఒక రకమైన 'సూక్ష్మస్థాయి అనుమానం'తో ఎన్నికల ప్రక్రియను కొనసాగించడం నిజమైన ప్రజాస్వామ్య లక్షణం కాదని విపక్షాలు వాదిస్తున్నాయి. ఈ అనుమానాలను నివృత్తి చేయడానికి వీవీప్యాట్ చిట్టీలన్నింటినీ లెక్కించాలి లేదా సాంకేతికతను పక్కనపెట్టి బ్యాలెట్ విధానానికి మళ్లాలని వారు సూచిస్తున్నారు. సాంకేతికత ఎంత పురోగమించినా, ప్రజా విశ్వాసం, విశ్వసనీయతే ఎన్నికల క్రతువుకు ప్రాణం. కాబట్టి, ఓటరు మనసులో ఉన్న ఏ చిన్న సందేహాన్ని అయినా తొలగించడం ఎన్నికల సంఘం, ప్రభుత్వ తక్షణ బాధ్యత.

## డిజిటల్ తెరవెనుక: మహిళలపై పెరుగుతున్న ఆన్‌లైన్ హింసపై UN నివేదిక

ఐక్యరాజ్యసమితి (UN) మహిళలు విడుదల చేసిన "టిప్పింగ్ పాయింట్" నివేదిక ప్రకారం, తమ హక్కుల కోసం పోరాడుతున్న మహిళలకు సోషల్ మీడియా ఒక ప్రమాదకరమైన యుద్ధభూమిగా మారింది. సర్వే చేసిన మహిళల్లో మూడింట రెండు వంతుల మంది ఆన్‌లైన్‌లో హింసను ఎదుర్కొంటున్నారు, మరియు 40% మందికి పైగా ఈ డిజిటల్ దుర్వినియోగం కారణంగా శారీరక వేధింపులు, వెంబడించడం వంటి నిజ-ప్రపంచ దాడులను కూడా ఎదుర్కొన్నారు. ప్రధాన పరిశోధకురాలు దీనిని "డిజిటల్ స్త్రీద్వేషం"గా అభివర్ణించారు. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, దేశాధ్యక్షులు లేదా ప్రధానమంత్రులు వంటి సీనియర్ నాయకుల అభ్యంతరకరమైన వ్యాఖ్యలు కూడా ఆన్‌లైన్ హింసకు ఆజ్యం పోస్తున్నాయి. మహిళలను సిగ్గుపడేలా చేసి, వారిని ప్రజా చర్చల నుండి దూరం చేసే ఉద్దేశ్యంతో జరుగుతున్న ఈ దాడులు ప్రజాస్వామ్యానికే పెను ప్రమాదం. ఈ డిజిటల్ అంధకారాన్ని ఎదుర్కోవడానికి బలమైన చట్టాలు, టెక్ కంపెనీలకు జవాబుదారీతనం మరియు పురుషులతో సహా అందరూ ఈ హింసకు వ్యతిరేకంగా గళం విప్పాల్సిన అవసరం ఉందని నివేదిక నొక్కి చెప్పింది.

సర్వత్రా

## పాలస్తీనియన్ ఖైదీల భయానక దుస్థితిపై ఇజ్రాయెల్ అంతర్గత నివేదిక హెచ్చరిక

ఇజ్రాయిల్ న్యాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పబ్లిక్ డిఫెండర్ కార్యాలయం విడుదల చేసిన ఒక సంచలన నివేదిక, అక్టోబరు 2023 నుండి పాలస్తీనియన్ ఖైదీల నిర్బంధ పరిస్థితులు అత్యంత దారుణంగా దిగజారాయని వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం, ఖైదీలు కేవలం కొన్ని చెంచాల సగం ఉడికిన అన్నంతో రోజు గడపాల్సి వస్తోంది, దీనివల్ల తీవ్ర పోషకాహార లోపం మరియు డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తుతున్నాయి. రద్దీ ప్రమాదకర స్థాయికి చేరింది. జైళ్ల సామర్థ్యం కంటే దాదాపు రెట్టింపు ఖైదీలు ఉన్నారు, వారిలో చాలామందికి నిద్రించడానికి స్థలం కూడా లేదు. అంతేకాక, ఖైదీలపై శారీరక బలవంతం, హింస విధానపరంగా అమలు అవుతోందని, ప్రాథమిక పరిశుభ్రత వస్తువులు లేకపోవడంతో గజ్జి వంటి వ్యాధులు అంటువ్యాధి స్థాయిలో వ్యాపించాయని నివేదిక పేర్కొంది. పరిస్థితికి పరాకాష్టగా, అక్టోబరు తర్వాత కస్టడీలో కనీసం 100 మంది మరణించినా, ఒక్క కేసుపైనా న్యాయ విచారణ జరగలేదు. ఈ నివేదిక ఇజ్రాయిల్ ప్రభుత్వం నుండే రావడం గమనార్హం, ఇది మానవ హక్కుల ఉల్లంఘనపై అంతర్జాతీయ దృష్టిని కోరుతోంది.

## 2023లో వంద కోట్ల మంది మహిళలు లైంగిక వేధింపులకు గురయ్యారు..



2023 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా 15 ఏళ్ల వయసు దాటిన వంద కోట్ల మందికిపైగా చిన్నారులు లైంగిక వేధింపు (Women Violence)లకు గురైనట్లు ద లాన్సెట్ జర్నల్ తన నివేదికలో పేర్కొన్నది. ఇక సుమారు 60 కోట్ల మంది అమ్మాయిలు తమ రహస్య భాగస్వామి చేతిలో హింసకు గురైనట్లు ద లాన్సెట్ జర్నల్ తన రిపోర్టులో వెల్లడించింది. రహస్య భాగస్వామి హింస, లైంగిక వేధింపుల కేసులు ఎక్కువగా ఆఫ్రికా, దక్షిణాసియా దేశాల్లో నమోదు అవుతున్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ఆరోగ్య సమస్యల ఆధారంగా కూడా నిర్ధారణకు వచ్చారు. ఆ ఖండాల్లో ఎక్కువ హెచ్ఐవీతో పాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధులు నమోదు అవుతున్నట్లు పరిశోధకులు వెల్లడించారు. 15 ఏళ్లు దాటిన మహిళలపై ఇండియాలో రహస్య భాగస్వాముల హింస సుమారు 23 శాతం ఉన్నట్లు తేల్చారు. 15 ఏళ్లు దాటిన సుమారు 30 శాతం మంది మహిళలు, 13 శాతం మంది పురుషులు తమ చిన్నతనంలో లైంగిక వేధింపులకు గురైనట్లు స్టడీలో తెలిపారు. గ్లోబల్ బర్డన్ ఆఫ్ డిసీజెస్(జీబీడీ) స్టడీ 2023 నివేదికలో ఉన్న డేటా ఆధారంగా పరిశోధకులు ఈ అంచనా వేశారు. రహస్య భాగస్వామి వల్ల కలిగిన వేధింపులతో ఎక్కువ శాతం మంది డిప్రెషన్‌కు లోనవుతున్నట్లు గుర్తించారు. చిన్నతనంలో లైంగిక వేధింపులకు గురైనవారిలో మానసిక ఆరోగ్యం దెబ్బతింటున్నదని నివేదికలో తెలిపారు. వారిలో మత్తు వాడకం, దీర్ఘకాలిక రుగ్మతలు వస్తున్నట్లు తేల్చారు.

# కృతజ్ఞత

**- ముహమ్మద్ వహీదుద్దీన్**

**'కృతజ్ఞత'**- మన ఆరాధనలన్నింటికీ ఆత్మ లాంటిది. కృతజ్ఞత అంటే ఎవరయినా మనకు మేలు చేస్తే వారి మేలును మనస్ఫూర్తిగా అంగీకరిస్తూ దాన్ని జ్ఞాపకం చేసుకుంటూ మేలు చేసిన వ్యక్తి పట్ల ప్రేమాభిమానాలను కలిగి ఉండాలి.

దేవుడు ఈ సువిశాల ప్రపంచాన్ని మన కోసమే సృష్టించాడు. బ్రహ్మాండమైన ఈ విశ్వంలో మానవుడనే ఈ చిన్నారి జీవి కోసం విశ్వప్రభువు ఎన్నెన్ని ఏర్పాట్లు చేశాడో గమనిస్తే, మన హృదయం కృతజ్ఞతా భావంతో నిండిపోవాలి, నిండిపోతుంది కూడా. మనం పీల్చే ప్రతి శ్వాస ఊపిరితిత్తుల్లోకి పోయి మన ప్రాణానికి తాజాదనం చేకూర్చుతుంది. అలాగే మనం పీల్చే ప్రతి శ్వాస దైవానికి కృతజ్ఞత అర్పించుకోవాలని మనకు పదేపదే గుర్తుచేస్తుంది. మనం పీల్చే ఈ గాలినేకాక ప్రతి దినం, ప్రతి క్షణం మనకు లాభం చేకూర్చే అసంఖ్యాక వస్తువులను అల్లాహ్ మనకు ప్రసాదించాడు. అల్లాహ్ మనకు అనుగ్రహించిన వస్తువులను, ఆయన చేసిన మేళ్లను అనుక్షణం మన దృష్టిలో పెట్టుకున్నప్పుడే నిజమైన కృతజ్ఞతా భావం కలుగుతుంది. ఎవరి హృదయాల్లో అయితే ఈ కృతజ్ఞతా భావం ఉండదో వారి విశ్వాసం(ఈమాన్) స్థిరంగా ఉండదు. అలాంటి వారి ఆరాధనల్లో సంకల్పశుద్ధి కూడా ఉండదు.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు : "అతనిలోకి తన ఆత్మను ఊదాడు, మీకు చెవులిచ్చాడు, కళ్ళిచ్చాడు, హృదయాన్నిచ్చాడు. అయినా మీకు కృతజ్ఞతలు తెలుపటం చాలా తక్కువ." (అస్ సజ్దా - 32: 9)

దేవుడు, ఆయన దాసుని సంబంధం యొక్క ముఖ్యమైన పునాది కృతజ్ఞత. ఈ కృతజ్ఞత సంబంధం హృదయంతోనూ ఉంటుంది, నోటితోనూ ఉంటుంది. ఆచరణతోనూ ఉంటుంది. హృదయ కృతజ్ఞత అంటే, మానవుడు తనకు దేవుడు ప్రసాదించిన వరాలను అనుక్షణం తలచుకుంటూ ఉండాలి. అందమైన ముఖం, పొందికైన అంగ సౌష్టవం, ఆరోగ్యవంతమైన శరీరం, ఇవి మనిషి తాను కోరి ఎంచుకున్న వరాలు కావు, ఇవి సృష్టికర్త ఇచ్చిన గొప్ప వరాలు. ఇలా తన ప్రమేయం లేకుండా, తనకు తెలియకుండానే లభించిన తన ఈ ఆకృతిని, అంగాలను చూసుకొని ఆనందిస్తూ, అడక్కుండానే తనకు వీటినిచ్చిన ఆ కర్తకు, స్వామికి, యజమానికి, తన నిజ ప్రభువుకు కృతజ్ఞతలు తెలుపకుండా మరచిపోతున్నాడు మనిషి. దేవుడు తనకు ఈ శరీరాన్నే కాదు, ఈ ప్రపంచాన్ని అనుగ్రహించాడు, తనకు ఇష్టమైన రీతిలో ఈ శరీరాన్ని దాని ప్రతి అంగాన్ని ప్రతి అవయవాన్ని వాడుకునే అధికారాన్నిస్తూ వీటన్నింటినీ వినియోగించుకునే బుద్ధిబలాన్ని కూడా ప్రసాదించాడు.

హృదయంలో కృతజ్ఞతా భావాన్ని మేల్కొల్పడానికి, ఆసక్తి, అభిలాష ఎంతో అవసరం. అలాకాకుండా దేవుడు మనకు ఎన్నెన్ని వస్తువులు అనుగ్రహించాడో, ఎలాంటి మహా భాగ్యాలు ప్రసాదించాడో అనే భావన మనసులో కలగకపోతే ఆ భావనను ఎల్లప్పుడూ సజీవంగా ఉంచకపోతే, మన హృదయంలో కృతజ్ఞతా భావం పెంపొందదు. అయితే సృష్టికర్త మనకు చేసిన మేళ్ళకు, ప్రసాదించిన వరాలకు కృతజ్ఞతగా ఆయన్ని ఎల్లప్పుడూ స్మరిస్తూ ఉండాలి. ఏదయినా కష్టం వస్తే సహనం వహించాలి గాని కృతఘ్నుడై ప్రవర్తించకూడదు.




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**